

స్టార్టప్ ఇంక్యుబేటర్లే భవిష్యత్తు!

అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..

WANTED రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త

దిన పత్రికలో పని చేయుటకు
తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను

JV NEWS

ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103

సంపుటి - 3 సంచిక -138 శుక్రవారం 6 నవంబర్ 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజీలు -8 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణకు సిద్ధం!

మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయం



హైదరాబాద్,నవంబర్ 5 (జర్నలిస్ట్ వార్త): కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల మరమ్మతులను చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన గురువారం హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో జరిగిన 38వ రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఈ మేరకు కీలక నిర్ణయం తీసుకున్నారు. అనంతరం మంత్రులు వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాబినెట్ నిర్ణయాలను వెల్లడించారు. మూడు బ్యారేజీల ఫౌండేషన్ కటాఫ్ వాల్, డౌన్‌స్ట్రీమ్, కాంక్రీట్ డయాఫ్రం వాల్‌లో లోపాలను జాతీయ ఆనకట్టల భద్రతా సంస్థ (ఎన్డీఎస్ఏ) గుర్తించి పలు సూచనలు చేసిందని మంత్రి తెలిపారు. ఎన్డీఎస్ఏ సూచించిన పరీక్షలన్నింటినీ నిర్వహించి, వాటి వివరాలను కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ), ఎన్డీఎస్ఏకు నివేదించినట్టు చెప్పారు. ఆయా సంస్థల సూచనల మేరకు మూడు బ్యారేజీల మిగతా2లో...

పారా అథ్లెట్ల పోరాటం దేశానికి స్ఫూర్తి

114 పతకాలతో భారత్ చరిత్రాత్మక ఘనత.. క్రీడాకారులతో ప్రధాని మోదీ ప్రత్యేక భేటీ



న్యూఢిల్లీ,నవంబర్ 5 (జర్నలిస్ట్ వార్త): ఆసియా పారా గేమ్స్-2026లో భారత క్రీడాకారులు సాధించిన చారిత్రాత్మక విజయంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రశంసలు కురిపించారు. పారా అథ్లెట్ల పోరాటం, పట్టుదల, అంకితభావం ప్రతి భారతీయుడికీ స్ఫూర్తినిస్తున్నాయని కొనియాడారు. గురువారం న్యూఢిల్లీలోని ఇందిరాగాంధీ ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో పతక విజేతలతో ప్రత్యేకంగా సమావేశమై అభినందించారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. గతంలో పిల్లలు క్రీడలను వృత్తిగా ఎంచుకోవడానికి తల్లిదండ్రులు సంకోచించేవారని గుర్తుచేశారు. మిగతా2లో...

ఇందిరమ్మ కుటుంబాలతో దీపావళి..

ప్రజాప్రతినిధులకు సీఎం పిలుపు

లబ్ధిదారుల సొంతింటి సంతోషంలో
నేనూ భాగస్వామినవుతా..
ప్రజాప్రతినిధులు, అధికారులు కూడా
పాల్గొనాలి: సీఎం రేవంత్‌రెడ్డి



పెట్టుబడులే లక్ష్యంగా తెలంగాణ గ్లోబల్ సమ్మిట్!

డిసెంబర్ 7 నుంచి మూడు రోజుల పాటు నిర్వహణ.. ఏర్పాట్లపై సీఎస్ సంజయ్ జాజు సమీక్ష



హైదరాబాద్,నవంబర్ 5 (జర్నలిస్ట్ వార్త): ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్2026ను దేశంలోనే అతిపెద్ద పారిశ్రామిక ప్రదర్శనగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేస్తోందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు తెలిపారు. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో హైదరాబాద్ ఫ్యూచర్ సిటీలో ఈ సదస్సు జరగనుందని వెల్లడించారు. గురువారం సచివాలయంలో సమ్మిట్ ఏర్పాట్లపై అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. జాతీయ, అంతర్జాతీయ పారిశ్రామిక దిగ్గజాలకు ఆహ్వానాలు పంపినట్లు, ఇప్పటికే పలు ప్రముఖ సంస్థలు పాల్గొనేందుకు ఆసక్తి చూపుతున్నాయని చెప్పారు. అంచనాలకు మించి స్పందన వస్తోందని పేర్కొన్నారు. సమ్మిట్‌లో రక్షణ, పారిశ్రామిక, ఫార్మాలైఫ్ సైన్సెస్ ఎక్స్‌పోలు

మిగతా2లో...



ఎన్నికల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి

సీఈఓ సుదర్శన్‌రెడ్డికి డిప్యూటీ కలెక్టర్ల సంఘం వినతి

హైదరాబాద్,నవంబర్ 5 (జర్నలిస్ట్ వార్త): ఎన్నికల నిర్వహణకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న బిల్లులను తక్షణమే మంజూరు చేయాలని రాష్ట్ర డిప్యూటీ కలెక్టర్ల సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.లచ్చిరెడ్డి గురువారం తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. రిటర్నింగ్ అధికారులు (ఆర్ఓలు), సహాయ రిటర్నింగ్ అధికారులు (ఏఆర్ఓలు) చేసిన అదనపు ఖర్చుల

మిగతా2లో...

గల్లంతైన 16 మంది సురక్షితం

- బేతుపల్లి ఘటనపై ఉత్కంఠకు తెర..
అర్ధరాత్రి సాహసోపేత రెస్క్యూ ఆపరేషన్



అక్రమ కట్టడాలపై కవిత కన్నెర్ర!

- నెల రోజుల్లో సమగ్ర సర్వే చేపట్టాలి..
లేదంటే పార్టీ తరఫున రెడ్‌మార్క్ వేస్తాం



హైదరాబాద్,నవంబర్ 5 (జర్నలిస్ట్ వార్త): ఖానామెట్ పరిధిలోని అయ్యప్ప సొసైటీలో వెలుస్తున్న అక్రమ నిర్మాణాలపై సమగ్ర సర్వే నిర్వహించి చర్యలు తీసుకోవాలని టీఆర్ఎస్ అధినేత్రి కల్వకుంట్ల కవిత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇందుకు నెల రోజుల గడువు ఇస్తున్నామని, అప్పటికీ చర్యలు తీసుకోకపోతే తమ పార్టీ కార్యకర్తలే అక్రమ కట్టడాలకు రెడ్‌మార్క్ వేస్తారని హెచ్చరించారు. బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో గురువారం మీడియాతో మిగతా2లో...

కొడంగల్‌లో మూడు రోజుల పాటు సీఎం రేవంత్ పర్యటన

రూ.9,053 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు..
50 వేల మంది రైతులతో భారీ సభ



ముగిసిన పరిషత్ ఎన్నికల పోలింగ్.. 7న ఓట్ల లెక్కింపు!

చెదురుమదురు ఘటనల మధ్య ముగిసిన ఓటింగ్..
21,012 మంది అభ్యర్థుల భవితవ్యం బ్యాలెట్ బాక్సుల్లో....



ఉచితంగా ప్రజల పత్రిక
RNI NO: TELTEL/2023/87607
జర్నలిస్ట్ వార్త
తెలుగు దిన పత్రిక

పారా అథ్లెట్ల పోరాటం దేశానికి స్ఫూర్తి

(మొదటి పేజీ తరువాయి)

క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు కేంద్ర ప్రభుత్వం క్రీడారంగంలో మౌలిక సదుపాయాలు, శిక్షణ, అవకాశాలను మెరుగుపరుస్తోందన్నారు. యువత కలలు, ప్రతిభ వృథా కాకుండా వ్యవస్థలో మార్పులు తీసుకొస్తున్నామని తెలిపారు.ఆసియా పారా గేమ్స్‌లో తొలిసారిగా 61 మంది భారత క్రీడాకారులు పాల్గొనడం విశేషమని మోదీ పేర్కొన్నారు. రెండు స్వర్ణ పతకాలు సాధించిన అర్చర్ శీతల్ దేవి, దృష్టిలోపాన్ని అధిగమించి అద్భుత ప్రదర్శన చేసిన అథ్లెట్ సిమ్రన్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ప్రస్తుత విజయాలతో ఆగిపోకుండా 2028 లాస్ ఏంజెలెస్ పారాలింపిక్స్‌లో మరిన్ని పతకాలు సాధించే లక్ష్యంతో ముందుకు సాగాలని క్రీడాకారులకు పిలుపునిచ్చారు. జపాన్‌లోని ఐచి-నగోయాలో ఇటీవల ముగిసిన ఆసియా పారా గేమ్స్‌లో భారత్ మొత్తం 114 పతకాలు సాధించి సరికొత్త రికార్డు నెలకొల్పింది. ఇందులో 30 స్వర్ణాలు, 35 రజతాలు, 49 కాంస్య పతకాలు ఉన్నాయి. గతంలో భారత్ సాధించిన 108 పతకాల రికార్డును అధిగమించి అత్యుత్తమ ప్రదర్శన నమోదు చేసింది. ఈ విజయాల్లో 97 మంది భారత పారా అథ్లెట్లు భాగస్వాములయ్యారు.

ఇందిరమ్మ కుటుంబాలతో దీపావళి..

హైదరాబాద్,నవంబర్ 05(పిసిడబ్ల్యూ న్యూస్): పేదల సొంతింటి కల సాకారమైన వేళ ఈ దీపావళి పండుగను ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో కలిసి జరుపుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' పేరుతో రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ.. పేదల సొంతింటి సంతోషంలో తాను కూడా భాగస్వామిని కానున్నానని పేర్కొన్నారు.ఈ దీపావళికి తాను ఒక ఇందిరమ్మ ఇంటికి వెళ్లి లబ్ధిదారుల కుటుంబంతో కలిసి పండుగ జరుపుకోనున్నట్లు సీఎం వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, అధికారులు కూడా తమ ప్రాంతాల్లోని ఇందిరమ్మ ఇళ్లకు వెళ్లి లబ్ధిదారులతో కలిసి దీపావళి జరుపుకోవాలని కోరారు. పేద కుటుంబాల ఆనందంలో పాలుపంచుకుంటూ వారి ఇళ్లలో దీపాలు వెలిగించాలని సూచించారు.రాష్ట్రంలో తొలి విడతలో మంజూరైన 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లలో ఇప్పటికే 2,21,500 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. మరో 1.90 లక్షల ఇళ్లు వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయి. పేదలకు సొంతింటి భద్రత, ఆత్మగౌరవం కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోంది. లబ్ధిదారుల ఇళ్లలో దీపావళి వేడుకలు నిర్వహించాలన్న సీఎం పిలుపుతో రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

పెట్టుబడులే లక్ష్యంగా తెలంగాణ గ్లోబల్ సమ్మిట్!

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించనున్నారు. యువ పారిశ్రామికవేత్తలు, జెన్-జీ ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు ప్రత్యేక స్టార్టప్ పెవిలియన్, క్రియేషన్ కార్నర్ ఏర్పాటు చేయనున్నారు. తెలంగాణ క్లైమేట్ కాంక్లేవ్, విద్యా సదస్సుతో పాటు ఏరోబాటిక్ ఎయిర్ షో ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి.ఇప్పటికే హైదరాబాద్, ఢిల్లీలో కర్టెన్ రైజర్ కార్యక్రమాలు పూర్తయ్యాయని, ప్రతినిధుల నమోదు ప్రక్రియ ప్రారంభమైందని సంజయ్ జాజు తెలిపారు. 'రైజింగ్ తెలంగాణ' లక్ష్య సాధనలో భాగంగా ప్రపంచ పారిశ్రామికవేత్తలను రాష్ట్రంలో పెట్టుబడులకు ఆకర్షించడమే సమ్మిట్ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.

ఎన్నికల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి

(మొదటి పేజీ తరువాయి)

బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు.2023 అసెంబ్లీ, 2024 లోక్‌సభ ఎన్నికల సందర్భంగా కేటాయించిన బడ్జెట్ సరిపోకపోవడంతో అధికారులు అదనంగా ఖర్చు చేయాల్సి వచ్చిందని లచ్చిరెడ్డి వివరించారు. ఎన్నికల నిర్వహణ కోసం కొందరు అధికారులు అప్పులు చేసి ఖర్చులు భరించారని, ఇప్పటికీ ఆ మొత్తాలు తిరిగి అందలేదని తెలిపారు.

బకాయిల చెల్లింపులో జాప్యం కారణంగా అప్పులు ఇచ్చినవారు అధికారులపై ఒత్తిడి తెస్తున్నారని, కొందరు రుణదాతలు కోర్టులను ఆశ్రయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల కార్యాలయాలు, నివాసాలకు వెళ్లి డబ్బులు చెల్లించాలని ఒత్తిడి చేయడం వల్ల వారి గౌరవానికి భంగం కలుగుతోందన్నారు.నాంపల్లి అసెంబ్లీ, మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గాలకు సంబంధించిన అదనపు వ్యయ ప్రతిపాదనలు సహా వివిధ స్థాయిల్లో పెండింగ్‌లో ఉన్న బడ్జెట్ ప్రతిపాదనలను వెంటనే పరిశీలించి నిధులు విడుదల చేయాలని సంఘం కోరింది.

అక్రమ కట్టడాలపై కవిత కన్నెర్ర!

(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడిన కవిత.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అయ్యప్ప సొసైటీలో గురుకుల ట్రస్టుకు చెందిన భూముల్లో 500 నుంచి 700 వరకు అక్రమ నిర్మాణాలు వెలిశాయని ఆరోపించారు. మరో 80 భవనాలు ప్రస్తుతం నిర్మాణంలో ఉన్నాయని తెలిపారు. హైకోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ నిర్మాణాలకు అనుమతులు ఇస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారని విమర్శించారు.రిజిస్ట్రేషన్లు సాధ్యం కాని భూముల్లో నోటరీల ద్వారా లావాదేవీలు జరుపుతున్నారని, పది అంతస్తుల వరకు భవనాలు నిర్మిస్తున్నారని కవిత ఆరోపించారు. వాటిలో పీజీ హాస్టళ్లు, కళాశాలలు నిర్వహిస్తున్నారని, కనీస భద్రతా ప్రమాణాలు కూడా పాటించడం లేదని పేర్కొన్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిదని ప్రశ్నించారు.అక్రమ నిర్మాణాలపై వార్తలు సేకరించేందుకు వెళ్లిన మీడియా ప్రతినిధులను భవన యజమానులు బెదిరిస్తున్నారని కవిత ఆరోపించారు. అయ్యప్ప సొసైటీలో సమగ్ర సర్వే నిర్వహించి, అనుమతులు లేని నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రజలు అక్కడి భూములు, ఫ్లాట్లు కొనుగోలు చేసే ముందు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

పోలీసులపై ఫిర్యాదులేవీ అందలేదు!

- జులై 20న జంతర్ మంతర్ నిరసనలపై సుప్రీంకోర్టుకు ఉన్నత స్థాయి కమిటీ నివేదిక



న్యూఢిల్లీ,నవంబర్ 5 (జర్నలిస్ట్ వార్త):జంతర్ మంతర్ వద్ద జులై 20న జరిగిన నిరసనల సందర్భంగా పోలీసులు అరాచకత్వానికి పాల్పడ్డారంటూ భౌతికంగా గానీ, ఆన్‌లైన్‌లో గానీ ఎలాంటి ఫిర్యాదులు అందలేదని ఉన్నత స్థాయి విచారణ కమిటీ (హెచ్‌పీఈసీ) వెల్లడించినట్లు సుప్రీంకోర్టు తెలిపింది. అక్టోబర్ 31న సమర్పించిన చర్యల నివేదికలో ఈ విషయం పేర్కొన్నట్లు గురువారం కోర్టు వెల్లడించింది.పోలీసుల చర్యలకు సంబంధించిన వీడియో క్లిప్పులు, ఇతర ఆధారాలను కమిటీ పరిశీలనకు సమర్పించేందుకు పిటిషనర్లకు కోర్టు అవకాశం కల్పించింది. ఫిర్యాదులను అజ్ఞాతంగా నమోదు చేసేందుకు కమిటీ ప్రత్యేక పోర్టల్‌ను ప్రారంభించింది. నిరసనల సందర్భంగా పోలీసులు ఉపయోగించిన మందుగుండు సామగ్రి వివరాలను సమర్పించకపోవడంపై పిటిషనర్లు ప్రశ్నించారు.అందుబాటులో ఉన్న సమాచారాన్ని పరిశీలించి జాప్యం లేకుండా నివేదికలు ఇవ్వాలని కమిటీని సుప్రీంకోర్టు ఆదేశించింది. నెల రోజుల్లో తొలి నిజ నిర్ధారణ నివేదిక సమర్పించాలని స్పష్టం చేసింది. ఫిర్యాదుల కోసం నిరవధికంగా వేచి ఉండలేమని పేర్కొంటూ, ఈ కేసుపై డిసెంబర్‌లో మరోసారి విచారణ చేపట్టనున్నట్లు తెలిపింది.

కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణకు ప్రభుత్వం సిద్ధం!

(మొదటి పేజీ తరువాయి)

మరమ్మతులను త్వరలోనే యుద్ధప్రాతిపదికన పూర్తి చేయనున్నట్లు వెల్లడించారు.డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్2026కు సంబంధించి సీనియర్ మంత్రులు, ఉన్నతాధికారులకు బాధ్యతలు అప్పగించినట్లు మంత్రి తెలిపారు. రాష్ట్ర పారిశ్రామిక విధానాలు, ఇతర రంగాల్లో విధానాలను సరళీకృతం చేయడం ద్వారా ప్రపంచంతో పోటీపడేలా తెలంగాణ ముందుకెళ్తోందన్నారు. ఈ సమ్మిట్ ద్వారా ప్రపంచవ్యాప్తంగా ఉన్న పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు రాష్ట్రంలో భారీగా పెట్టుబడులు పెట్టే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు.రాష్ట్రవ్యాప్తంగా 2.25 లక్షలకు పైగా ఇందిరమ్మ ఇళ్లు పూర్తయ్యాయని మంత్రి వెల్లడించారు. ఈ నేపథ్యంలో 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' కార్యక్రమాన్ని నిర్వహించాలని క్యాబినెట్ నిర్ణయించినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నుంచి గ్రామ సర్పంచ్ వరకు ప్రజాప్రతినిధులంతా తమ పరిధిలోని ఒక ఇందిరమ్మ ఇంట్లో జరిగే దీపావళి వేడుకల్లో పాల్గొనాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఈ నెల 7, 8, 9 తేదీల్లో ముఖ్యమంత్రి కొడంగల్‌లో మెగా రైతు మేళా, పారిశ్రామిక ప్రదర్శనతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించనున్నారని, మంత్రులందరూ పాల్గొనాలని నిర్ణయించినట్లు తెలిపారు.మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా నవంబర్ 19న సిద్దిపేటలో ఇందిరమ్మ జీవిత బీమా పథకాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నట్లు మంత్రి వెల్లడించారు. రాష్ట్రంలోని ప్రతి వార్డు, గ్రామపంచాయతీ నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. దీనితో పాటు రెండో విడత ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని కూడా చేపట్టనున్నట్లు చెప్పారు.రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీల కోసం వేర్వేరుగా కమిషన్లు ఏర్పాటు చేయాలని క్యాబినెట్ ఆమోదం తెలిపిందన్నారు.

అలాగే రాష్ట్రంలోని ఏడు ప్రాంతాల్లో రెవెన్యూ శాఖకు చెందిన భూములను అవసరాల మేరకు వివిధ ప్రభుత్వ శాఖలకు బదిలీ చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని కూడా క్యాబినెట్ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి పొంగులేటి వివరించారు.

గలంతైన 16 మంది సురకితం

సత్తుపల్లి,నవంబర్ 5 (జర్నలిస్ట్ వార్త):ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం బేతుపల్లి పెద్దచెరువు వద్ద బుధవారం సాయంత్రం మొదలైన ఉత్కంఠ చివరకు సుఖాంతమైంది. చెరువులో చిక్కుకున్న ఎనిమిది మంది మత్స్యకారులను రక్షించేందుకు వెళ్లిన ఎన్డీఆర్ఎఫ్ బృందం పడవ బోల్తా పడటంతో మత్స్యకారులతో పాటు సహాయక సిబ్బంది కూడా చెరువులో చిక్కుకుపోయారు. సమాచారం అందుకున్న ఎన్డీఆర్ఎఫ్ బృందాలు వెంటనే రంగంలోకి దిగి అర్ధరాత్రి వరకు రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించాయి. చీకటిని సైతం లెక్కచేయకుండా మొత్తం 16 మందిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చాయి.రెస్క్యూ సిబ్బంది సమయస్ఫూర్తితో వ్యవహరించడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా అందరూ క్షేమంగా బయటపడ్డారు. ఘటన జరిగినప్పటి నుంచి కలెక్టర్ దివాకర టీఎస్, ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ రాత్రంతా చెరువు వద్దే ఉండి పరిస్థితిని పర్యవేక్షించారు. బాధిత కుటుంబాలకు ధైర్యం చెప్పారు.ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవతో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ సూచనలు అందించారు. రెస్క్యూ ఆపరేషన్‌ను విజయవంతం చేసిన ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, అగ్నిమాపక శాఖ సిబ్బందిని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అభినందించారు. ఎమ్మెల్యే మట్టా రాగమయి కృషిని, జిల్లా అధికారుల పనితీరును ప్రశంసిస్తూ రెస్క్యూ బృందాలకు ప్రభుత్వం తరఫున ధన్యవాదాలు తెలిపారు.

కొడంగల్‌లో మూడు రోజుల పాటు సీఎం రేవంత్ పర్యటన

హైదరాబాద్నవంబర్ 5 (జర్నలిస్ట్ వార్త):ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ నెల 7, 8, 9 తేదీల్లో తన సొంత నియోజకవర్గమైన కొడంగల్‌లో మూడు రోజుల పాటు పర్యటించనున్నారు. ఈ సందర్భంగా మెగా రైతు మేళా, పారిశ్రామిక ప్రదర్శనను ప్రారంభించడంతో పాటు రూ.9,053.48 కోట్లతో చేపట్టనున్న 13 అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయనున్నారు. అలాగే రూ.46.08 కోట్లతో నిర్మించిన 10 ప్రభుత్వ భవనాలను ప్రారంభించనున్నారు.ఈ నెల 7న హకీంపేటలో మెగా రైతు మేళా, పారిశ్రామిక ప్రదర్శనను సీఎం ప్రారంభిస్తారు. రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తలతో సమావేశమై ఆధునిక వ్యవసాయ పద్ధతులు, నూతన సాంకేతిక పరిజ్ఞానం, మార్కెటింగ్ అవకాశాలపై చర్చిస్తారు.

పారిశ్రామికవేత్తలతోనూ సమావేశం కానున్నారు.8న స్వయం సహాయక సంఘాల మహిళలతో సమావేశమవుతారు. లగచర్ల ఇండస్ట్రియల్ కారిడార్‌లో రూ.81 కోట్లతో నిర్మించనున్న పామాయిల్ ఫ్యాక్టరీకి శంకుస్థాపన చేస్తారు. రూ.5,060 కోట్ల రేడియల్ రోడ్డు, రూ.2,100 కోట్ల ఎత్తిపోతల పథకం రెండో దశ, రూ.1,410 కోట్లతో 223 బీటీ రహదారుల నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టనున్నారు. వ్యవసాయ కళాశాల, తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు, ఆధునిక బస్టాండ్లు తదితర అభివృద్ధి పనులను ప్రారంభించనున్నారు.

పూర్తయిన పాఠశాలలు, కళాశాలలు, పోలీస్ స్టేషన్లు, ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ భవనాలను కూడా ప్రారంభిస్తారు.పర్యటన చివరి రోజైన 9న హకీంపేటలో భారీ రైతు బహిరంగ సభ నిర్వహించనున్నారు.

ఈ సభకు పది జిల్లాల నుంచి సుమారు 50 వేల మంది రైతులు హాజరయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నారు. సీఎం పర్యటన నేపథ్యంలో అధికారులు సభా ప్రాంగణం, రైతుమేళా, పారిశ్రామిక ప్రదర్శన వద్ద ఏర్పాట్లు ముమ్మరం చేశారు. భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించారు.

ముగిసిన పరిషత్ ఎన్నికల పోలింగ్.. 7న ఓట్ల లెక్కింపు!

- చెదురుమదురు ఘటనల మధ్య ముగిసిన ఓటింగ్.. 21,012 మంది అభ్యర్థుల భవితవ్యం బ్యాలెట్ బాక్సుల్లో



అమరావతి, నవంబర్ 5 (జర్నలిస్ట్ వార్త): ఆంధ్రప్రదేశ్‌లో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ గురువారం సాయంత్రం 5 గంటలకు ముగిసింది. రాష్ట్రవ్యాప్తంగా ఉదయం 7 గంటలకు ప్రారంభమైన ఓటింగ్ ప్రక్రియ సాయంత్రం వరకు కొనసాగింది. ఉదయం పలు ప్రాంతాల్లో వర్షాల కారణంగా పోలింగ్ మందకొడిగా సాగినప్పటికీ, మధ్యాహ్నం తర్వాత ఓటర్లు పెద్ద సంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చారు. సాయంత్రం 5 గంటల సమయానికి క్యూలైన్లలో ఉన్నవారికి కూడా ఓటు వేసేందుకు అధికారులు అవకాశం కల్పించారు. రాష్ట్రవ్యాప్తంగా 582 జడ్పీటీసీ, 7,767 ఎంపీటీసీ స్థానాలకు పోలింగ్ నిర్వహించారు. ఈ ఎన్నికల్లో సుమారు 21,012 మంది అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకున్నారు. పోలింగ్ ముగిసే సమయానికి 65 నుంచి 68 శాతం వరకు ఓటింగ్ నమోదై ఉండవచ్చని అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. మధ్యాహ్నం 1 గంటకు 30.50 శాతంగా ఉన్న పోలింగ్.. ఆ తర్వాత వేగం పుంజుకుంది. రాయలసీమ, కోస్తాంధ్ర ప్రాంతాల్లోని పలు జిల్లాల్లో ఓటర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. అయితే కొన్ని గిరిజన, తీర ప్రాంతాల్లో పోలింగ్ శాతం తక్కువగా నమోదైనట్లు సమాచారం. కొన్ని ప్రాంతాల్లో ఉద్రిక్తతలుపోలింగ్ సందర్భంగా పల్నాడు, అనంతపురం, చంద్రగిరి, ఎన్టీఆర్ జిల్లాల్లోని కొన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ఘర్షణలు చోటుచేసుకున్నాయి. రిగ్గింగ్, నకిలీ ఓట్ల ఆరోపణలతో రాజకీయ పార్టీలకు చెందిన వర్గాల మధ్య వాగ్వాదాలు జరిగాయి. కొన్ని చోట్ల కర్రలు, రాళ్లతో దాడులకు పాల్పడినట్లు సమాచారం. పోలీసులు వెంటనే రంగంలోకి దిగి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ఘటనల కారణంగా కొన్ని ప్రాంతాల్లో ఉద్రిక్త వాతావరణం నెలకొన్నప్పటికీ, పోలింగ్ ప్రక్రియ పెద్దగా అంతరాయం లేకుండా ముగిసింది.పోలింగ్ పూర్తయిన వెంటనే అధికారులు అభ్యర్థులు, ఏజెంట్ల సమక్షంలో బ్యాలెట్ బాక్సులకు సీళ్లు వేశారు. వాటిని కట్టుదిట్టమైన భద్రత మధ్య స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించారు. ఎన్నికల సంఘం వెబ్‌కాస్టింగ్ ద్వారా పోలింగ్ కేంద్రాల్లో నమోదైన దృశ్యాలను పరిశీలిస్తోంది. ఎక్కడైనా తీవ్రమైన అక్రమాలు జరిగినట్లు నిర్ధారణ అయితే నవంబర్ 6న రీపోలింగ్ నిర్వహించే అవకాశం ఉంది.నవంబర్ 7న ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుంది. అదే రోజు ఫలితాలను ప్రకటించనున్నారు. అనంతరం నవంబర్ 11, 12 తేదీల్లో ఎంపీపీ అధ్యక్షులు, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ల ఎన్నికలు నిర్వహించనున్నారు. దీంతో పరిషత్ ఎన్నికల తుది ఫలితాలపై రాజకీయ పార్టీలతో పాటు అభ్యర్థుల్లో ఉత్కంఠ నెలకొంది.

ఓటర్ల జాబితా సవరణ గడువు పొడిగింపు

● ఆరు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఎస్ఐఆర్ ప్రక్రియకు అదనపు సమయం



న్యూఢిల్లీ,నవంబర్ 5 (జర్నలిస్ట్ వార్త):ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను ఆరు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో మరింత విస్తరించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయించింది. మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, హర్యానా, నాగాలాండ్‌తో పాటు ఢిల్లీలో ఈ ప్రక్రియకు సంబంధించిన గడువులను పొడిగించింది. తెలంగాణలో ఓటర్ల నుంచి వచ్చే అభ్యంతరాలు, దరఖాస్తుల పరిష్కారానికి నవంబర్ 26 వరకు గడువు ఇచ్చింది. ఆంధ్రప్రదేశ్, హర్యానాలో నవంబర్ 20 వరకు, నాగాలాండ్‌లో నవంబర్ 25 వరకు గడువు పొడిగించింది. మహారాష్ట్రలో అభ్యంతరాలు, దరఖాస్తుల స్వీకరణను డిసెంబర్ 13 వరకు కొనసాగించనున్నారు. ఈ రాష్ట్రాల్లో తుది ఓటరు జాబితాలను నవంబర్ 30న ప్రకటించనున్నారు.ఢిల్లీలో అభ్యంతరాల స్వీకరణ గడువును డిసెంబర్ 25 వరకు పొడిగించగా, తుది ఓటరు జాబితాను డిసెంబర్ 22న విడుదల చేయనున్నారు. ఓటర్ల జాబితాలో అర్హులైన వారందరికీ అవకాశం కల్పించడంతో పాటు అభ్యంతరాలను పరిష్కరించేందుకు ఈ గడువు పొడిగింపు చేపట్టినట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది.

నూతన వధూవరులకు పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ఆశీస్సులు

వివాహ విందు కార్యక్రమంలో పాల్గొని శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మార్పీఎస్ అధినేత



హసన్‌పర్తి/నవంబర్ 5 (జర్నలిస్ట్ వార్త):
కాకతీయ యూనివర్సిటీ బయోటెక్నాలజీ విభాగంలో ప్రొఫెసర్‌గా, ప్రస్తుతం చీఫ్ వార్డెన్‌గా విధులు నిర్వర్తిస్తున్న పొడేటి శ్రీనివాస్ కుమార్తె ఆశ్రిత ప్రియ వివాహం అనిరుధ్‌తో ఘనంగా జరిగింది. వివాహానంతరం హసన్‌పర్తిలోని కోడెం ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన విందు కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్ అధినేత, పద్మశ్రీ అవార్డు గ్రహీత మంద కృష్ణ మాదిగ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులు ఆశ్రిత ప్రియ, అనిరుధ్‌లకు పుష్పగుచ్ఛం అందజేసి వివాహ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వధూవరులను ఆశీర్వదించి వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఎంఎస్పీ జాతీయ నాయకులు మంద కుమార్ మాదిగ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు గోవింద్ నరేష్ మాదిగ, వరంగల్ జిల్లా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మాజీ జెడ్పీటీసీ బొల్లం అజయ్ కుమార్ ఆత్మహత్య

మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ జెడ్పీటీసీ మారపాక రవి



స్టేషన్ ఘన్‌పూర్, నవంబర్ 05 (జర్నలిస్ట్ వార్త):
రఘునాథపల్లి మండల మాజీ జెడ్పీటీసీ బొల్లం అజయ్ కుమార్ (మణికంఠ) ఉరివేసుకొని మృతి చెందడం తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ విషయం తెలుసుకున్న మాజీ జిల్లా స్టాండింగ్ కమిటీ చైర్మన్, స్టేషన్ ఘన్‌పూర్ మాజీ జెడ్పీటీసీ మారపాక రవి గురువారం మృతుడి భౌతికకాయానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.ఈ సందర్భంగా మారపాక రవి మాట్లాడుతూ ప్రజా జీవితంలో బొల్లం అజయ్ అందించిన సేవలను గుర్తుచేసుకున్నారు. ఆయన మరణం పార్టీకి, కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు, అభిమానులకు తీరని లోటని పేర్కొన్నారు. అజయ్ మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు తన సానుభూతిని తెలిపారు.

విదేశీ పర్యటన ముగించుకుని వచ్చిన ఎంపీ, ఎమ్మెల్యేకు ఘనస్వాగతం

శంషాబాద్ విమానాశ్రయంలో ఆత్మీయంగా స్వాగతం పలికిన దేవస్థాన చైర్మన్ పాట్లపల్లి శ్రీధర్ రావు



స్టేషన్ ఘన్‌పూర్/నవంబర్ 05 (జర్నలిస్ట్ వార్త):విదేశీ పర్యటన ముగించుకుని స్వదేశానికి తిరిగి వచ్చిన వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరికి ఘనస్వాగతం లభించింది. బుధవారం రాత్రి హైదరాబాద్‌లోని శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో చిల్పూర్ గుట్ట దేవస్థాన చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావుతో పాటు నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు వారికి అపూర్వ స్వాగతం పలికారు.ఈ సందర్భంగా ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరికి పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాలతో సత్కరించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. విదేశీ పర్యటనను విజయవంతంగా ముగించుకుని తిరిగి వచ్చిన ప్రజాప్రతినిధులకు పార్టీ శ్రేణులు ఆత్మీయ స్వాగతం పలకడంతో విమానాశ్రయం వద్ద సందడి నెలకొంది. తమపై అభిమానంతో స్వాగతం పలికిన దేవస్థాన చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు, కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలకు ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

కేసముద్రం మున్సిపల్ కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన అంబేద్కర్ యువజన సంఘం నూతన కమిటీ



కేసముద్రం/నవంబర్ 05 (జర్నలిస్ట్ వార్త):కేసముద్రం మున్సిపాలిటీ కమిషనర్ శ్రీనివాసరావును తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం కేసముద్రం మున్సిపాలిటీ నూతన కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కమిషనర్ శ్రీనివాసరావుకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో సంఘం నూతన కమిటీ అధ్యక్షుడు సోమారపు మదర్, ఉపాధ్యక్షుడు వేల్పుగొండ ఏలియా, ప్రధాన కార్యదర్శి జల్లంపల్లి శ్రీకాంత్, కోశాధికారి చింతకుంట్ల రవి, సహాయ కార్యదర్శి మహేష్, గౌరవ సలహాదారులు దండు శ్రీను, చింతకుంట్ల వెంకన్న, మిట్టగడుపుల జలంధర్, పందుల సారయ్య, గద్దల యాకస్వామి, జల్లంపల్లి సుధాకర్, ఈదుల వెంకటేష్, జన్ను కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పేదల నివాసాల మధ్య మట్టి తవ్వకాలు..

బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి

ప్రభుత్వ భూమిలో అక్రమ తవ్వకాలను వెంటనే నిలిపివేయాలి -సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రాగుల రమేష్

హసన్‌పర్తి/నవంబర్ 5 (జర్నలిస్ట్ వార్త): హసన్‌పర్తి మండలం భీమారం గ్రామ పరిధిలోని సర్వే నంబర్లు 70, 73లో పేద కుటుంబాలు నివసిస్తున్న ప్రభుత్వ భూమిలో జరుగుతున్న మట్టి తవ్వకాలను వెంటనే నిలిపివేసి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఎం హనుమకొండ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రాగుల రమేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం సీపీఎం హసన్‌పర్తి మండల కమిటీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట గంటపాటు ధర్నా నిర్వహించి, అనంతరం డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా రాగుల రమేష్ మాట్లాడుతూ గత ఐదేళ్లుగా నిరుపేద కుటుంబాలు ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకుని నివసిస్తున్నాయని తెలిపారు. అయితే ఇటీవల కొందరు వ్యక్తులు అక్రమంగా మట్టి తవ్వకాలు చేపట్టి



పెద్దపెద్ద గుంతలు తీయడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గుంతల కారణంగా వాహనాల రాకపోకలకు కూడా ఆటంకం ఏర్పడుతోందని పేర్కొన్నారు.

ప్రభుత్వ భూమిలో మట్టి తవ్వకాలు చేపడుతూ కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు, భూస్వాములు మట్టిని విక్రయించుకుంటూ పేద ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. రెవెన్యూ అధికారులు తక్షణమే స్పందించి మట్టి తవ్వకాలను నిలిపివేయడంతో పాటు, తవ్వకాలకు పాల్పడిన వారిపై సమగ్ర విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని, అక్కడ నివసిస్తున్న పేద కుటుంబాలకు రక్షణ కల్పించాలని కోరారు. అధికారులు నిర్లక్ష్యం వహిస్తే రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు గుమ్మడి రాజుల రాములు, మండల కార్యదర్శి వేలు రజిత, మండల కమిటీ సభ్యులు మంద సుచందర్, వేలు సుమన్‌తో పాటు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్న ప్రజా ప్రభుత్వం

ఇందిరమ్మ ఇళ్ల పథకంతో నిరుపేదలకు భరోసా -లబ్ధిదారుల గృహప్రవేశ కార్యక్రమంలో ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు





హసన్‌పర్తి/నవంబర్ 05 (జర్నలిస్ట్ వార్త):
పేద, మధ్యతరగతి కుటుంబాల సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. హసన్‌పర్తి మండలం మల్లారెడ్డిపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం లబ్ధిదారులు పున్నం మురళి, రజిత నిర్మించుకున్న నూతన ఇంటి గృహప్రవేశ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై ఇంటిని ప్రారంభించారు. ఈ సందర్భంగా నూతన గృహంలోకి అడుగుపెడుతున్న కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేసి, వారు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు ఉండాలన్నదే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ సంకల్పమని తెలిపారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన నిరుపేదలకు ఆర్థిక సహాయం అందించి వారి సొంతింటి కలను నిజం చేస్తున్నామని పేర్కొన్నారు. ఇల్లు అనేది కేవలం నివాసం మాత్రమే కాదని, ప్రతి కుటుంబానికి ఆత్మగౌరవం, భద్రత, భవిష్యత్తుకు భరోసా అని అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకొని నాణ్యతతో ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని, పేదల సంక్షేమం, గ్రామాల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మల్లారెడ్డిపల్లి గ్రామ సర్పంచ్ గాజు కృష్ణవేణి యుగేందర్ యాదవ్, పీఏసీఎస్ చైర్మన్ కుమారస్వామి, డైరెక్టర్లు రత్నాకర్, ఐలి గౌడ్, గ్రామ మాజీ శాఖ అధ్యక్షుడు గట్ల సాంబయ్య, జిల్లా యువజన నాయకుడు జెట్టి యుగేందర్, అర్వపల్లి సర్పంచ్ ప్రభాకర్, సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ సీనియర్ నాయకుడు కామ్రేడ్ పెసర నారాయణ కన్నుమూత

పార్టీకి తీరని లోటు.. ఎర్రజెండా ఉద్యమానికి ఆయన సేవలు చిరస్మరణీయం

చివరి శ్వాస వరకు కమ్యూనిస్టు సిద్ధాంతాలే ఊపిరిగా జీవించిన పోరాట యోధుడు



ధర్మసాగర్ /వరంగల్ ఉమ్మడి జిల్లా బ్యూరోనవంబర్ 05 (జర్నలిస్ట్ వార్త): హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం తాళ్లతాటికాల గ్రామానికి చెందిన సీపీఐ గ్రామ శాఖ కార్యవర్గ సభ్యుడు, సీనియర్ నాయకుడు కామ్రేడ్ పెసర నారాయణ బుధవారం తెల్లవారుజామున 4 గంటలకు తుదిశ్వాస విడిచారు. ఆయన మరణవార్తతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. విషయం తెలుసుకున్న ధర్మసాగర్ మండల సీపీఐ కోశాధికారి, డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు రాజారపు రత్నం, మండల సీనియర్ నాయకుడు డోకి రాజన్న తదితరులు నారాయణ పార్థివదేహంపై ఎర్రజెండా పార్టీ కండువా కప్పి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కామ్రేడ్ పెసర నారాయణ మరణం కమ్యూనిస్టు ఉద్యమానికి, సీపీఐ పార్టీకి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. పదవులు, వ్యక్తిగత ప్రయోజనాలకు అతీతంగా జీవితాంతం పార్టీ సిద్ధాంతాలే ఊపిరిగా బతికిన నిబద్ధతగల నాయకుడని కొనియాడారు. ఎక్కడ ఉన్నా, ఏ పరిస్థితుల్లో ఉన్నా ఎర్రజెండాను వీడకుండా పార్టీ ఆశయాల కోసం పనిచేసిన ఆయన నిబద్ధత నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. ప్రజా ఉద్యమాల్లో ఆయన అందించిన సేవలు పార్టీ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని తెలిపారు. కామ్రేడ్ నారాయణ ఆశయాలను కొనసాగించడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని స్పష్టం చేశారు.మృతుడు పెసర నారాయణకు కుమారుడు యాదగిరితో పాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ కార్యక్రమంలో నేరెళ్ల రాజయ్య, రాజారపు శీను, పిట్టల వీరయ్య, నీల ఎల్లయ్య, సాంబరాజు, కొమురయ్య, కొండబోయిన పాపయ్య, పెసర లక్ష్మయ్య తదితరులు పాల్గొని కన్నీటి నివాళులర్పించారు.



వేశకాంతుల చెరువుకు పటిష్టమైన కరకట్ట నిర్మించాలి

వరద బాధిత కుటుంబాలకు తక్షణమే రూ.25 వేల ఆర్థిక సహాయం అందించాలి

బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నంబూరి రామలింగేశ్వరరావు డిమాండ్

సత్తుపల్లి/నవంబర్ 5 (జర్నలిస్ట్ వార్త):
అకాల వర్షాలతో సత్తుపల్లి మండలంలోని బేతుపల్లి చెరువు నిండిపోవడంతో వరద నీరు సత్తుపల్లి వేశకాంతుల చెరువులోకి చేరి తీవ్ర నష్టం కలిగించింది. చెరువు సమీపంలోని కేసీఆర్ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు పూర్తిగా నీటమునగడంతో సుమారు 40 నిరుపేద కుటుంబాలు నిరాశ్రయులయ్యాయి. కట్టుబట్టలతో రోడ్డున పడిన బాధిత కుటుంబాలను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నంబూరి రామలింగేశ్వరరావు డిమాండ్ చేశారు.సత్తుపల్లి బీజేపీ పట్టణ అధ్యక్షుడు బానోత్ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో బీజేపీ నాయకుల బృందం వరద బాధిత ప్రాంతాన్ని సందర్శించి బాధిత కుటుంబాలను పరామర్శించింది. ఈ సందర్భంగా రామలింగేశ్వరరావు మాట్లాడుతూ వరద నీటిలో ఇళ్లలోని నిత్యావసర సరుకులు, గృహోపకరణాలు,



ఇతర విలువైన వస్తువులు మునిగిపోయాయని, ఒక్కో కుటుంబానికి సుమారు రూ.50 వేల నుంచి లక్ష రూపాయల వరకు ఆస్తి నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు.రోజువారీ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించే పేద కుటుంబాలు ప్రస్తుతం తినడానికి తిండి, ఉండటానికి ఇల్లు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. రాష్ట్ర మంత్రి, స్థానిక ఎమ్మెల్యే బాధిత ప్రాంతాన్ని సందర్శించి ఒక్కో కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సహాయం అందిస్తామని ప్రకటించినట్లు తెలిసిందని, అయితే జరిగిన నష్టంతో పోలిస్తే ఆ సాయం ఏమాత్రం సరిపోదన్నారు.

ప్రభుత్వం తక్షణమే స్పందించి ప్రతి బాధిత కుటుంబానికి రూ.25 వేల చొప్పున అత్యవసర ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా భవిష్యత్తులో ఇలాంటి వరద ముప్పు పునరావృతం కాకుండా వేశకాంతుల చెరువుకు పటిష్టమైన కరకట్ట నిర్మించాలని, వరద నీటిని మళ్లించేందుకు శాశ్వత ఏర్పాట్లు చేయడంతో పాటు సమర్థవంతమైన మురుగునీటి పారుదల వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరారు.పేద కుటుంబాలు సర్వం కోల్పోయి రోడ్డున పడిన సమయంలో ప్రభుత్వం బాధ్యతగా వ్యవహరించాలని, తాత్కాలిక ఆర్థిక సహాయంతో సరిపెట్టకుండా వరద సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని నంబూరి రామలింగేశ్వరరావు స్పష్టం చేశారు. బాధిత కుటుంబాలకు న్యాయం జరిగే వరకు భారతీయ జనతా పార్టీ వారి పక్షాన నిలబడి పోరాటం చేస్తుందని ప్రకటించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు జొన్నలగడ్డ నరేష్, పట్టణ ప్రధాన కార్యదర్శి మంద శివసాయి యాదవ్, జిల్లా మైనారిటీ అధ్యక్షుడు ఎస్.కె. రహమతుల్లా, బీజేపీ నాయకులు బానోత్ హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

అణగారిన ప్రజల పక్షం
RNI NO: TELTEL/2023/87607
జర్నలిస్ట్ వార్త
తెలుగు దిన పత్రిక

కరువు వేళ రైతులకు బ్యాంకర్లు అండగా నిలవాలి

అర్హులైన రైతులకు కొత్త రుణాలు మంజూరు చేయాలి

పంట రుణాల పునర్వ్యవస్థీకరణతో ఆర్థిక ఉపశమనం కల్పించాలి

కొత్తగూడ, గంగారం మండలాల్లో బ్యాంకుల ఏర్పాటుకు తక్షణ చర్యలు

జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్



మహబూబాబాద్ జిల్లా/నవంబర్ 05 (జర్నలిస్ట్ వార్త):
ఎల్‌నినో ప్రభావంతో జిల్లాలో నెలకొన్న కరువు పరిస్థితుల నేపథ్యంలో రైతులకు బ్యాంకర్లు అండగా నిలవాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ సూచించారు. అర్హులైన రైతులకు నూతన రుణాలు మంజూరు చేయడంతో పాటు పంట రుణాల పునర్వ్యవస్థీకరణ ద్వారా ఆర్థిక ఉపశమనం కల్పించాలని బ్యాంకు అధికారులను ఆదేశించారు.
గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన ప్రత్యేక జిల్లా స్థాయి సంప్రదింపుల కమిటీ, జిల్లా స్థాయి సమీక్ష కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో నెలకొన్న కరువు పరిస్థితులు, రైతులకు బ్యాంకుల ద్వారా అందించాల్సిన సహాయక చర్యలు, పంట రుణాల పునర్వ్యవస్థీకరణ, వ్యవసాయ అనుబంధ రంగాలకు రుణాల మంజూరుపై బ్యాంకర్లు, సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు.
ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితుల నేపథ్యంలో జిల్లాలోని కొత్తగూడ, గూడూరు, డోర్నకల్, సీరోలు, కురవి, నెల్లికుదురు, ఇనుగుర్తి మండలాలను కరువు ప్రభావిత మండలాలుగా ప్రభుత్వం ప్రకటించిందని తెలిపారు. కరువు ప్రభావిత ప్రాంతాల్లోని రైతులకు ఉపశమనం కల్పించేందుకు ఎస్-ఎల్‌బీసీ, ఆర్‌బీఐ మార్గదర్శకాల ప్రకారం పంట రుణాలను పునర్వ్యవస్థీకరించాలని సూచించారు.
తీవ్ర కరువు ప్రభావిత మండలాల రైతులకు 12 నెలల మారటోరియం కల్పించడంతో పాటు, ఆ గడువుతో కలిపి రుణ చెల్లింపు వ్యవధిని మొత్తం 60 నెలల వరకు పొడిగించే అవకాశం ఉందని వివరించారు. మధ్యస్థ కరువు ప్రభావిత మండలాల రైతులకు 12 నెలల మారటోరియంతో పాటు రుణ చెల్లింపు గడువును మొత్తం 36 నెలల వరకు పొడిగించవచ్చని తెలిపారు. ఈ మార్గదర్శకాలను సమర్థవంతంగా అమలు చేసి అర్హులైన రైతులకు ప్రయోజనం చేకూర్చాలని ఆదేశించారు.
కరువు కారణంగా రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న తరుణంలో రుణాల వసూలు కోసం వారిపై ఎలాంటి ఒత్తిడి తీసుకురావద్దని స్పష్టం చేశారు. రైతుల పట్ల మానవతా దృక్పథంతో వ్యవహరిస్తూ నిబంధనల ప్రకారం అర్హులైన ప్రతి రైతుకు రుణ సదుపాయాలు కల్పించాలని సూచించారు.
రైతులకు రుణ సదుపాయాలు, పంట రుణాల పునర్వ్యవస్థీకరణపై అవగాహన కల్పించేందుకు మండలాల వారీగా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలన్నారు. రైతు వేదికలు, గ్రామసభల ద్వారా వ్యవసాయ శాఖ అధికారుల సమన్వయంతో బ్యాంకులు అందిస్తున్న సేవలు, రుణ సదుపాయాలపై విస్తృత ప్రచారం నిర్వహించాలని తెలిపారు.
వ్యవసాయంతో పాటు ఉద్యానవన, మత్స్య, పశుసంవర్ధక రంగాల్లో అర్హులైన వారికి అవసరమైన రుణాలు అందించాలని ఆదేశించారు. ఆయా శాఖల ద్వారా ప్రభుత్వం మంజూరు చేసే రుణాలు అర్హులకు చేరేలా బ్యాంకు అధికారులు చర్యలు తీసుకోవాలని, ఉద్యానవన పంటలకు బీమా సదుపాయాలు కల్పించే అంశంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.
ముఖ్యంగా గంగారం, కొత్తగూడ మండలాల ప్రజల సౌకర్యార్థం వాణిజ్య షెడ్యూల్డ్ బ్యాంకుల ఏర్పాటుకు తక్షణమే ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. బ్యాంకుల స్థాపనకు సంబంధిత అధికారులు వేగంగా చర్యలు చేపట్టాలని, అప్పటివరకు ఆయా ప్రాంతాల ప్రజలకు ఉమ్మడి సేవా కేంద్రాల ద్వారా బ్యాంకింగ్ సేవలు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.
ఎంఎస్ఎంఈ పథకం ద్వారా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అవసరమైన రుణాలు అందించేలా చర్యలు తీసుకోవాలని బ్యాంకు అధికారులకు కలెక్టర్ సూచించారు.
ఈ సమావేశంలో డీఆర్డీఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, డీఏఓ విజయచంద్ర, ఎల్డీఎం కె.యాదగిరి, జీఎం ఇండస్ట్రీస్ శ్రీమన్నారాయణ రెడ్డి, జిల్లా పశువైద్య అధికారి డాక్టర్ కిరణ్ కుమార్, ఉద్యానవన శాఖ అధికారి జినుగు మరియన్నా, వివిధ బ్యాంకుల అధికారులు, సంబంధిత శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.

నిరుపేద విద్యార్థులకు చేయూత..

పరీక్ష ఫీజులు చెల్లించిన సామాజిక కార్యకర్త షేక్ లతీఫ్

చదువుకు పేదరికం అడ్డుకాకూడదనే లక్ష్యంతో ముందడుగు

43 మంది పదో తరగతి విద్యార్థులకు ఆర్థిక సాయం



వైరా/నవంబర్ 05 (జర్నలిస్ట్ వార్త):నిరుపేద విద్యార్థుల చదువుకు ఆర్థిక ఇబ్బందులు అడ్డుకాకూడదనే సంకల్పంతో సామాజిక కార్యకర్త షేక్ లతీఫ్ తన సేవా దృక్పథాన్ని చాటుకున్నారు. వైరా మండలంలోని సిరిపురం, గరికపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న 43 మంది విద్యార్థుల పరీక్ష ఫీజులను ఆయన స్వయంగా చెల్లించి విద్యార్థులకు అండగా నిలిచారు.సిరిపురం కేజీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 27 మంది విద్యార్థుల పరీక్ష ఫీజులను చెల్లించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైరా వెహికల్ ఇన్‌స్పెక్టర్ వెంకటస్వామి హాజరయ్యారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సూర్యకుమారి, పాఠశాల కమిటీ చైర్మన్ షేక్ బి. జాన్‌బీతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.అదేవిధంగా గరికపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 16 మంది విద్యార్థుల పరీక్ష ఫీజులను కూడా షేక్ లతీఫ్ చెల్లించారు. ఈ కార్యక్రమానికి గరికపాడు సర్పంచ్ నాగలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమేష్, పాఠశాల కమిటీ చైర్మన్ గంగిదేవుల తిరుపతమ్మతో పాటు ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి అండగా నిలుస్తూ పరీక్ష ఫీజుల భారం తగ్గించిన షేక్ లతీఫ్ సేవలను పలువురు అభినందించారు.

తుఫాన్ నష్టంపై రైతుల పక్షాన మాజీ ఎమ్మెల్యే మెచ్చా గళం

నష్టపోయిన ప్రతి రైతుకూ తక్షణమే పరిహారం చెల్లించాలి -రూ.3.5 కోట్లతో నిర్మించిన రింగుబండకు ఒక్క తుఫాన్‌కే గండి.. ప్రజాధనం వృథా

నిర్మాణ నాణ్యతపై సమగ్ర విచారణ జరపాలి.. అధికారుల నిర్లక్ష్యమే భారీ నష్టానికి కారణం





అశ్వారావుపేట/నవంబర్ 5 (జర్నలిస్ట్ వార్త): మురసు తుఫాన్ ప్రభావంతో అశ్వారావుపేట మండలంలో రైతులకు, ప్రజలకు తీవ్ర నష్టం వాటిల్లిన నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మెచ్చా నాగేశ్వరరావు దెబ్బతిన్న ప్రాంతాల్లో పర్యటించి క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించారు. దెబ్బతిన్న పంట పొలాలు, గండ్లు పడిన చెరువులు, కొట్టుకుపోయిన రహదారులను పరిశీలించి బాధిత రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

రైతులకు వెంటనే నష్టపరిహారం అందించాలి

తుఫాన్ కారణంగా పంటలు దెబ్బతిని రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని మెచ్చా ఆవేదన వ్యక్తం చేశారు. పెట్టుబడులు పెట్టి పంట చేతికొచ్చే సమయంలో ప్రకృతి విపత్తు రైతుల ఆశలను ఆవిరి చేసిందన్నారు. నియోజకవర్గవ్యాప్తంగా నష్టపోయిన ప్రతి రైతును గుర్తించి సమగ్ర పంట నష్టం అంచనా వేయాలని, ఎలాంటి జాప్యం లేకుండా అర్హులైన రైతులందరికీ నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

దెబ్బతిన్న రహదారులు, చెరువుల పరిశీలన

అచ్యుతాపురం చిన్నయ్యకట్టు చెరువుకు గండి పడటంతో రహదారి పూర్తిగా కొట్టుకుపోయిన ప్రాంతాన్ని మెచ్చా పరిశీలించారు. రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడటంతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకున్నారు. సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి తక్షణమే మరమ్మతులు చేపట్టి రహదారిని పునరుద్ధరించాలని సూచించారు.
పాతనారంవారిగూడెం నుంచి గుర్రాల చెరువుకు వెళ్లే మార్గంతో పాటు పాతనారంవారిగూడెం నుంచి మొద్దులగూడెం వెళ్లే రహదారులు దెబ్బతిన్న ప్రాంతాలను పరిశీలించారు. ఈ మార్గాలపై ఆధారపడే ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు.
అశ్వారావుపేట మున్సిపాలిటీ పరిధిలోని దొంతికుంట చెరువు వద్ద గండి పడటంతో నష్టపోయిన రైతులను పరామర్శించారు. వారి పంట నష్టం, ఆర్థిక ఇబ్బందులను అడిగి తెలుసుకుని అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కేవలం హామీలతో సరిపెట్టకుండా నష్టాన్ని అంచనా వేసి బాధిత రైతులందరికీ న్యాయమైన పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.
నారాయణపురంలోనూ తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతులతో మాట్లాడి వారి పరిస్థితులను తెలుసుకున్నారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, రైతులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

రూ.3.5 కోట్ల రింగుబండకు ఒక్క తుఫాన్‌కే గండి

గుమ్మడివల్లి పెద్దవాగు ప్రాజెక్టు వద్ద రూ.3.5 కోట్ల వ్యయంతో నిర్మించిన రింగుబండకు గండి పడిన ప్రాంతాన్ని మెచ్చా నాగేశ్వరరావు పరిశీలించారు. కోట్లాది రూపాయల ప్రజాధనంతో నిర్మించిన రింగుబండ ఒక్క తుఫాన్‌ను కూడా తట్టుకోలేకపోవడంపై నిర్మాణ నాణ్యతను ప్రశ్నించారు. కేవలం కమిషన్ల కోసమే ఈ నిర్మాణం చేపట్టారా? ఈ రింగుబండ నిర్మాణం వల్ల ఒక్క రైతుకైనా ప్రయోజనం కలిగిందా? అని నిలదీశారు. రూ.3.5 కోట్ల ప్రజాధనం వృథా అయినట్లయిందని విమర్శించారు.నిర్మాణ పనుల నాణ్యతను పర్యవేక్షించాల్సిన అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. సరైన ప్రణాళిక, ముందస్తు అంచనా లేకుండా పనులు చేపట్టడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు. రింగుబండ నిర్మాణంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా మెచ్చా నాగేశ్వరరావు మాట్లాడుతూ రైతుల పంటలను, కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని కాపాడాల్సిన బాధ్యత పాలకులు, అధికారులపై ఉందన్నారు. విపత్తులు వచ్చినప్పుడు హడావుడిగా పర్యటించడం కాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి దెబ్బతిన్న ప్రాంతాల్లో తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని, రహదారులు, చెరువులకు శాశ్వత మరమ్మతులు చేయాలని, నష్టపోయిన రైతులందరికీ పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.
ఈ పర్యటనలో మాజీ జడ్పీటీసీ జూపల్లి రమణారావు, మాజీ ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామమూర్తి, మోహన్ రెడ్డి, యుఎస్ ప్రకాశ్ రావు, స్థానిక బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మోదీ సుపరిపాలనపై విద్యార్థులకు అవగాహన

కాంగ్రెస్ దుష్ప్రచారాలను తిప్పికొట్టాలి

ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉద్యోగాలపై ప్రభుత్వాన్ని నిలదీయాలి



ధర్మసాగర్/ఉమ్మడి వరంగల్ బ్యూరోనవంబర్ 5 (జర్నలిస్ట్ వార్త): ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని, సుపరిపాలనతో ప్రజలకు మెరుగైన పాలన అందిస్తున్నారని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. మోదీ పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను విద్యార్థులకు వివరించడంతో పాటు, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంపై అవగాహన కల్పించేందుకు గురువారం స్టేషన్ ఘన్‌పూర్‌లోని సాయి వైష్ణవి ఇంటర్ కళాశాలలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటర్ల జాబితాలో ఉన్న బోగస్ ఓట్లను తొలగించి, అర్హులైన ఓటర్లకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని నాయకులు అన్నారు. రోహింగ్యాలు, బంగ్లాదేశీయులకు సంబంధించిన అక్రమ ఓట్లపై కూడా చట్టప్రకారం పరిశీలన జరగాలని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న దుష్ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని, వాస్తవాలను తెలుసుకోవాలని సూచించారు. విద్యార్థుల సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ ప్రభుత్వం మొండి వైఖరి ప్రదర్శిస్తోందని విమర్శించారు. ముఖ్యంగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, నిరుద్యోగులకు ఇచ్చిన ఉద్యోగాల హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటమాడటం తగదని అన్నారు. బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి గాజ శ్యాంసుందర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కుమార్, ప్రధాన కార్యదర్శులు శివారెడ్డి, రాజేష్, జిల్లా ఎస్టీ మోర్చా ఉపాధ్యక్షుడు బాదావత్ కిష్టు, బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధి రాజేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనా దృక్పథాన్ని పెంపొందించాలి

చెకుముకి టాలెంట్ టెస్ట్‌తో విద్యార్థుల ప్రతిభకు గుర్తింపు

జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు చిర్రాయాకాంతం గౌడ్



కేసముద్రం/నవంబర్ 05 (జర్నలిస్ట్ వార్త):విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత, శాస్త్రీయ పరిజ్ఞానం, మేధాశక్తిని వెలికితీసి వారిలో శాస్త్రీయ ఆలోచనా దృక్పథాన్ని పెంపొందించేందుకు చెకుముకి టాలెంట్ టెస్ట్ ఎంతగానో దోహదపడుతుందని జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు చిర్రాయాకాంతం గౌడ్ అన్నారు.జన విజ్ఞాన వేదిక కేసముద్రం మండల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న సైన్స్ సంబరాలు2026, చెకుముకి టాలెంట్ టెస్ట్‌కు సంబంధించిన పోస్టర్‌ను బుధవారం కల్వల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చెకుముకి రాయి నిప్పురవ్వలను రగిలించినట్లుగా ఈ పరీక్ష విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు మంచి వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు.జన విజ్ఞాన వేదిక మండల శాఖ అధ్యక్షులు బండారు నరేందర్ మాట్లాడుతూ 8, 9, 10వ తరగతుల విద్యార్థులకు ఈ నెల 12న పాఠశాల స్థాయిలో చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నెల 21న మండల స్థాయిలో, 28న జిల్లా స్థాయిలో, డిసెంబర్ 11 నుంచి 13వ తేదీ వరకు రాష్ట్రస్థాయిలో పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.కేసముద్రం మండలంలోని అన్ని యాజమాన్యాల పాఠశాలలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఈ పరీక్షలో పాల్గొనేలా ఉపాధ్యాయులు, పాఠశాలల యాజమాన్యాలు సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక మండల శాఖ ప్రధాన కార్యదర్శి గాడుదుల మోహనకృష్ణ, కోశాధికారి బొల్లెద్దు విజయ్ చందర్, పాఠశాల ఉపాధ్యాయులు యాకాంబ్రం, శంకర్, సత్యనారాయణ, రాము, జుబేర్ అలీ, బాలశౌరెడ్డి, శ్రీనివాస్, నాగేందర్, గోపి తదితరులు పాల్గొన్నారు.

పరుగుల వీరుడు..

జాతీయస్థాయికి ధర్మసాగర్ బిడ్డ!

400 మీటర్ల పరుగులో రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం..

శివపురిలో జరగనున్న జాతీయ పోటీలకు గంగారపు ప్రభుదేవ్ ఎంపిక



ధర్మసాగర్/వరంగల్ ఉమ్మడి జిల్లా బ్యూరోనవంబర్ 5 (జర్నలిస్ట్ వార్త): పరుగుల పందెంలో ప్రత్యర్థులను వెనక్కి నెట్టి.. లక్ష్యమే ఊపిరిగా ముందుకు సాగి.. రాష్ట్రస్థాయిలో అగ్రస్థానాన్ని కైవసం చేసుకున్నాడు ధర్మసాగర్ యువకుడు గంగారపు ప్రభుదేవ్. పట్టుదల, కఠోర సాధనకు ప్రతిఫలంగా జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికై మండలానికి గర్వకారణంగా నిలిచాడు.
ఖమ్మంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో బుధవారం నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్రస్థాయి అండర్-17 బాలుర 400 మీటర్ల పరుగుపందెంలో ధర్మసాగర్ మండల కేంద్రానికి చెందిన గంగారపు శ్రీనివాస్ కుమారుడు ప్రభుదేవ్ అద్భుత ప్రతిభ కనబరిచాడు. హోరాహోరీగా సాగిన పోటీలో ప్రత్యర్థులను అధిగమించి ప్రథమ స్థానాన్ని సాధించాడు. ఈ విజయంతో జాతీయస్థాయి పోటీలకు తన స్థానాన్ని ఖరారు చేసుకున్నాడు.

జాతీయస్థాయిలో సత్తా చాటేందుకు సిద్ధం

ఈ నెల 12న మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని శివపురిలో నిర్వహించనున్న జాతీయస్థాయి స్కూల్ గేమ్స్ అథ్లెటిక్స్ పోటీల్లో ప్రభుదేవ్ పాల్గొననున్నాడు. రాష్ట్రస్థాయిలో సాధించిన విజయాన్ని జాతీయస్థాయిలోనూ పునరావృతం చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నాడు. ఓ మారుమూల మండల కేంద్రం నుంచి జాతీయస్థాయి క్రీడా వేదికకు ఎదిగిన ప్రభుదేవ్ ప్రతిభ స్థానిక యువతకు స్ఫూర్తిగా నిలుస్తోంది. జాతీయస్థాయి పోటీల్లోనూ విజయం సాధించి తెలంగాణ రాష్ట్రానికి, ధర్మసాగర్ మండలానికి కీర్తిప్రతిష్ఠలు తీసుకురావాలని క్రీడాభిమానులు, స్థానికులు ఆకాంక్షిస్తున్నారు.





గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదులో
ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

అర్హులైన పట్టభద్రులు తప్పనిసరిగా ఓటు నమోదు చేసుకోవాలి

యూత్ కాంగ్రెస్ జనగామ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ జానీ బాబా

స్టేషన్ ఘన్‌పూర్/నవంబర్ 05 (జర్నలిస్ట్ వార్త):



గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదులో అర్హులైన ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని యూత్ కాంగ్రెస్ జనగామ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ జానీ బాబా పిలుపునిచ్చారు. ఉమ్మడి నల్లగొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆదేశాల మేరకు, షేక్ జానీ బాబా ఆధ్వర్యంలో స్టేషన్ ఘన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలో పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో పట్టభద్రుల గొంతుకను వినిపించేందుకు ఓటు హక్కు ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఓటు హక్కు కలిగిన అర్హులైన ప్రతి పట్టభద్రుడు తమ పేరును ఓటరు జాబితాలో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని కోరారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ ఓటరు నమోదుపై అవగాహన పెంచుకొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు ఫయాజ్, అఫ్జల్, రాజు, అఖిల్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నాటిన మొక్కలను చూసేందుకు
మళ్లీ సత్తుపల్లికి వచ్చిన ఎంవీఐ వెంకటపుల్లయ్య

తాను నాటిన మొక్కలు వృక్షాలుగా ఎదగడం చూసి మురిసిపోయిన అధికారి

సత్తుపల్లి/నవంబర్ 5 (జర్నలిస్ట్ వార్త): మొక్కలు నాటడమే కాదు.. వాటిని సంరక్షించి వృక్షాలుగా ఎదిగేలా చూడటంలోనే నిజమైన సంతృప్తి ఉందని చాటుతున్నారు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సంగం వెంకటపుల్లయ్య. 2020 నుంచి 2024 వరకు సత్తుపల్లి మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన ఆయన ప్రస్తుతం భద్రాచలం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. 'వృక్షో రక్షతి రక్షితః' అనే నినాదంతో పర్యావరణ పరిరక్షణను తన బాధ్యతగా భావించిన వెంకటపుల్లయ్యకు మొక్కలంటే ఎంతో మమకారం. సత్తుపల్లి పరిసర ప్రాంతాల్లో ఎక్కడ ఖాళీ స్థలం కనిపించినా మొక్కలు నాటడాన్ని అలవాటుగా చేసుకున్నారు. పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, కోర్టు, పోలీస్ స్టేషన్లు తదితర ప్రాంగణాల్లో వివిధ రకాల మొక్కలు నాటి పచ్చదనం పెంపునకు కృషి చేశారు.



తన కార్యాలయానికి వచ్చే ప్రజలకు మొక్కల పెంపకం ఆవశ్యకతను వివరిస్తూ, స్వయంగా మొక్కలు అందించి వాటిని సంరక్షించాలని ప్రోత్సహించేవారు. సత్తుపల్లి, పెనుబల్లి, కల్లూరు, వేంసూరు తదితర ప్రాంతాల్లో విస్తృతంగా మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణలో తనదైన ముద్ర వేశారు.

ప్రస్తుతం భద్రాచలంలో విధులు నిర్వహిస్తున్నప్పటికీ సత్తుపల్లిలో తాను నాటిన మొక్కలపై ఆయనకున్న మమకారం ఏమాత్రం తగ్గలేదు. ఇందులో భాగంగా గురువారం సత్తుపల్లికి వచ్చిన ఆయన గతంలో తాను మొక్కలు నాటిన పోలీస్ స్టేషన్లు, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలను సందర్శించి వాటి ప్రస్తుత పరిస్థితిని పరిశీలించారు.

తాను నాటిన కొన్ని మొక్కలు ఎండిపోవడం చూసి ఆవేదన వ్యక్తం చేయగా, మరికొన్ని మొక్కలు పెద్ద వృక్షాలుగా ఎదగడం చూసి ఆనందంతో మురిసిపోయారు. వాటిని ఆప్యాయంగా తాకుతూ తన సంతోషాన్ని వ్యక్తం చేశారు. మొక్కలు నాటడం ఒక కార్యక్రమంగా కాకుండా వాటిని పెంచి సంరక్షించడమే నిజమైన పర్యావరణ సేవ అని తన ఆచరణతో చాటిచెప్పారు.

ఈ సందర్భంగా సత్తుపల్లి డివిజన్ ప్రైవేట్ పాఠశాలల సంఘం అధ్యక్షుడు పసుపులేటి నాగేశ్వరరావు ఎంవీఐ వెంకటపుల్లయ్య పర్యావరణ సేవలను అభినందించారు. ఆయనను శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు.

శంకుస్థాపన చేసి నాలుగు నెలలైనా
ప్రారంభంకాని మహిళా సంఘ భవన నిర్మాణం

అధికారుల నిర్లక్ష్యంతో మహిళలకు తప్పని అవస్థలు

తక్షణమే నిర్మాణ పనులు చేపట్టాలి

: ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కమిటీ సభ్యులు గడ్డం నాగార్జున

కేసముద్రం/నవంబర్ 05 (జర్నలిస్ట్ వార్త):



కేసముద్రం మండలం కార్తపల్లి గ్రామపంచాయతీ ఆవరణలో మహిళా సంఘ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసి నాలుగు నెలలు గడుస్తున్నా పనులు ప్రారంభించకపోవడం అధికారుల, గ్రామపంచాయతీ పాలకవర్గ నిర్లక్ష్యానికి నిదర్శనమని ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కమిటీ సభ్యులు గడ్డం నాగార్జున విమర్శించారు.

గురువారం కార్తపల్లి గ్రామం నుంచి విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంఘాల కోసం భవనాలను మంజూరు చేయగా, అందులో భాగంగా కార్తపల్లి గ్రామానికి కూడా భవనం మంజూరైందని తెలిపారు. సుమారు నాలుగు నెలల క్రితం శంకుస్థాపన చేసినప్పటికీ ఇప్పటివరకు నిర్మాణ పనులు ప్రారంభించకపోవడం విచారకరమన్నారు. ఈ విషయాన్ని పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి స్పందన లేకపోవడం, గ్రామపంచాయతీ పాలకవర్గం నిర్లక్ష్యంగా వ్యవహరించడం దారుణమని ఆరోపించారు. ఇటీవల ఇతర గ్రామాల నుంచి వచ్చిన సీసీలు, మహిళా సంఘాల నాయకులతో ఏపీఎం కృష్ణమూర్తి కార్తపల్లి గ్రామంలో సమావేశం నిర్వహించగా, మహిళా సంఘ భవనం అందుబాటులో లేకపోవడంతో మహిళలు పాఠశాల ఆవరణలో కటిక నేలపై కూర్చొని సమావేశం నిర్వహించుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా సంఘాల అవసరాలను గుర్తించి ప్రభుత్వం భవనాన్ని మంజూరు చేసినప్పటికీ, నాలుగు నెలలుగా నిర్మాణ పనులు ప్రారంభించకపోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, గ్రామపంచాయతీ పాలకవర్గం నిర్లక్ష్యాన్ని వీడి శంకుస్థాపనకే పరిమితమైన మహిళా సంఘ భవన నిర్మాణ పనులను తక్షణమే ప్రారంభించాలని గడ్డం నాగార్జున రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు అందేలా కృషి చేస్తాం

లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు పంపిణీ చేసిన కాంగ్రెస్ నాయకులు

తల్లాడ/నవంబర్ 5 (జర్నలిస్ట్ వార్త):



తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం పట్టణానికి చెందిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు దగ్గుల మోహన్ రెడ్డి, బొడ్డు శ్రీనులకు ఇందిరమ్మ ఇళ్ల పట్టాలను కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గొడుగునూరు లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు దుండేటి వీరారెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకులు జక్కంపూడి కిషోర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పట్టణంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ జిల్లా మంత్రుల సహకారంతో పాటు సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ సహకారంతో ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యేలా కృషి చేస్తామని తెలిపారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. మురుసు తుఫాన్ ప్రభావంతో సత్తుపల్లి నియోజకవర్గంలోని బేతుపల్లిలో వరదల్లో చిక్కుకున్న మత్స్యకారులను సురక్షితంగా బయటకు తీసుకురావడంలో ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలతో కలిసి రాత్రంతా అక్కడే ఉండి పరిస్థితిని పర్యవేక్షించిన జిల్లా మంత్రులకు, ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్‌కు తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యుగంధర్, రామారావు, లబ్ధిదారులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎల్ఓసీ ద్వారా రూ.2.50 లక్షల వైద్య సాయం అందించిన ఎంపీ బలరాం నాయక్

నిరుపేద కుటుంబానికి అండగా నిలిచిన ఎంపీ..

బాధిత కుటుంబం విజ్ఞప్తిపై వెంటనే స్పందించిన కౌన్సిలర్ కిషోర్ నాయక్, మాజీ ఉపసర్పంచ్ వెంకన్న నాయక్

కేసముద్రం/నవంబర్ 05 (జర్నలిస్ట్ వార్త):



ఆపదలో ఉన్న నిరుపేద కుటుంబానికి మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యుడు పోరిక బలరాం నాయక్ అండగా నిలిచారు. అనారోగ్యంతో బాధపడుతూ మెరుగైన వైద్యం కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధితురాలికి ఎల్ఓసీ ద్వారా రూ.2 లక్షల 50 వేల ఆర్థిక సాయం మంజూరు చేయించి ఆదుకున్నారు.

కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని దన్నసరి గ్రామానికి చెందిన చుంచు కళావతి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ కాలుకు గాయం కావడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చేరారు. అయితే వైద్య ఖర్చులు భరించే ఆర్థిక స్థోమత లేకపోవడంతో బాధిత కుటుంబ సభ్యులు స్థానిక 3వ వార్డు కౌన్సిలర్ ధరావత్ కిషోర్ నాయక్, మాజీ ఉపసర్పంచ్ బానోతు వెంకన్న నాయక్‌లను ఆశ్రయించారు. వెంటనే స్పందించిన కౌన్సిలర్ కిషోర్ నాయక్, మాజీ ఉపసర్పంచ్ వెంకన్న నాయక్ బాధిత కుటుంబ పరిస్థితిని ఎంపీ పోరిక బలరాం నాయక్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఎంపీ సంబంధిత అధికారులతో మాట్లాడి బాధితురాలి వైద్య ఖర్చుల నిమిత్తం ఎల్ఓసీ ద్వారా రూ.2.50 లక్షల ఆర్థిక సాయం మంజూరు చేయించారు. బాధితురాలికి మెరుగైన వైద్యం అందించేందుకు ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ ధరావత్ కిషోర్ నాయక్, మాజీ ఉపసర్పంచ్ బానోతు వెంకన్న నాయక్ మాట్లాడుతూ నిరుపేద కుటుంబాల కష్టాల్లో పాలుపంచుకుంటూ ఆపదలో ఉన్నవారికి అండగా నిలిచే నాయకుడు ఎంపీ బలరాం నాయక్ అని కొనియాడారు. ఆయన చొరవతోనే పేద కుటుంబానికి వైద్య సహాయం అందిందని పేర్కొంటూ ఎంపీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీ అందించిన ఆర్థిక సాయంపై బాధిత కుటుంబ సభ్యులు, స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో 3వ వార్డు కౌన్సిలర్ ధరావత్ కిషోర్ నాయక్, మాజీ ఉపసర్పంచ్ బానోతు వెంకన్న నాయక్, అజిత్ రెడ్డి, కోసాని శ్రీధర్, మార్కెట్ డైరెక్టర్ యాదగిరి, శివప్రసాద్, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పడిపోయిన వరి పాలాలను
పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య

తుఫాన్ బాధిత రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలి

పంట నష్టంపై వెంటనే సర్వే నిర్వహించి పరిహారం అందించాలి





తల్లాడ/నవంబర్ 5 (జర్నలిస్ట్ వార్త): మురుసు తుఫాన్ ప్రభావంతో నేలకొరిగిన వరి పంట పొలాలను సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య గురువారం పరిశీలించారు. తల్లాడ మండలంలోని గొల్లగూడెం, బిల్లుపాడు గ్రామాల్లో కోడూరి ఉమాదేవి, వీర కృష్ణ ఆధ్వర్యంలో ఆయన పర్యటించి దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా బాధిత రైతులతో మాట్లాడి పంట నష్టం వివరాలను అడిగి తెలుసుకున్నారు. తుఫాన్ కారణంగా వరి పంటలు నేలకొరిగి రైతులు తీవ్రంగా నష్టపోయారని, ప్రభుత్వం తక్షణమే స్పందించి బాధిత రైతులను ఆదుకోవాలని సండ్ర వెంకట వీరయ్య డిమాండ్ చేశారు. పంట నష్టంపై అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి, సమగ్ర నివేదికను ప్రభుత్వానికి పంపించాలని కోరారు. ఈ సందర్భంగా లంబాడి హక్కుల పోరాట సమితి నాయకుడు ధర్మసోత్ దశరథ్ నాయక్ మాట్లాడుతూ తల్లాడ మండలం రంగంబంజరలో తనకు చెందిన మూడు ఎకరాల వరి పొలం పూర్తిగా నీట మునిగిందని తెలిపారు. తుఫాన్ కారణంగా పంటలు దెబ్బతిని రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అధికారులు ఆలస్యం చేయకుండా పంట నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వం ద్వారా తగిన పరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు

చిన్నారుల బంగారు భవిష్యత్తుకు అంగన్‌వాడీలే పునాదులు

విద్యతో పాటు పౌష్టికాహారం అందించాలి..

-మున్సిపల్ చైర్‌పర్సన్ బానోత్ సునీత వెంకన్న

కేసముద్రం/నవంబర్ 5 (జర్నలిస్ట్ వార్త):



చిన్నారులకు విద్యతో పాటు పౌష్టికాహారం అందించడం ద్వారా వారి బంగారు భవిష్యత్తుకు బలమైన పునాదులు వేయాలని కేసముద్రం మున్సిపల్ చైర్‌పర్సన్ బానోత్ సునీత వెంకన్న అన్నారు. కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని రెండో వార్డు రేకులతండా, 12వ వార్డులోని అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించిన అక్షరాభ్యాసం, మొదటి ముద్ద కార్యక్రమాల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించి, మొదటి ముద్ద కార్యక్రమంలో స్వయంగా అన్నప్రాసన చేసి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారుల విద్యాభ్యాసం, ఆరోగ్యం, పోషణలో అంగన్‌వాడీ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. ప్రతి చిన్నారికి నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం అందేలా అంగన్‌వాడీ సిబ్బంది కృషి చేయాలని సూచించారు. బాల్యంలోనే విద్య, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటే చిన్నారుల ఉజ్వల భవిష్యత్తుకు బలమైన పునాదులు పడతాయని పేర్కొన్నారు. అనంతరం మున్సిపాలిటీ పరిధిలోని ప్రాథమిక పాఠశాలను సందర్శించి ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడారు. పాఠశాలలోని మౌలిక వసతులు, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో 12వ వార్డు కౌన్సిలర్ తరాల వీరేష్ యాదవ్, ప్రధానోపాధ్యాయులు బానోత్ దేవినాథ్ సింగ్, అంగన్‌వాడీ టీచర్లు దుర్గ, లలిత, ప్రభురాణి తదితరులు పాల్గొన్నారు.

భవ్యను ఆశీర్వదించిన
రాజకీయ పార్టీ నాయకులు



తల్లాడ/నవంబర్ 5 (జర్నలిస్ట్ వార్త):

తల్లాడ మండలం అన్నారుగూడెం గ్రామానికి చెందిన గుమ్మా వలరాజు మనవరాలు భవ్య ప్రతాన కార్యక్రమం గురువారం కృష్ణాజిల్లా కంభంపాడు గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తల్లాడ మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు, అన్నారుగూడెం గ్రామ ఉపసర్పంచ్, సీనియర్ నాయకులు కొమ్మినేని వెంకటేశ్వర్లు (కేవీ) హాజరయ్యారు. ఈ సందర్భంగా భవ్యకు అక్షింతలు వేసి ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు పొన్నం కృష్ణయ్య, గుమ్మా వలరాజు, పేరసాని నరసింహారావు, గుమ్మా నరేష్, గుమ్మా హరి, దిరిశాల నరసింహారావుతో పాటు పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

మానసిక దివ్యాంగుల పునరావాస కేంద్రంలో అన్నదానం

కుమారుడి 17వ వర్ధంతి సందర్భంగా అన్నవితరణ చేసిన తల్లిదండ్రులు



మధిర, నవంబర్ 5 (జర్నలిస్ట్ వార్త):

మానవతా దృక్పథంతో మానసిక దివ్యాంగుల పిల్లలకు అన్నదానం చేయడం అభినందనీయమని పలువురు కొనియాడారు. నియోజకవర్గ పరిధిలోని దెందుకూరు గ్రామానికి చెందిన దెందుకూరు సొసైటీ చైర్మన్ కోట వెంకటకృష్ణ, విజయశాంతి దంపతులు తమ కుమారుడు కోట హర్షిత్ సాయి 17వ వర్ధంతి సందర్భంగా మదర్ థెరిస్సా సేవాసదనం మానసిక దివ్యాంగుల పునరావాస కేంద్రంలో పిల్లలకు అన్నవితరణ చేశారు.

ఈ సందర్భంగా హర్షిత్ సాయి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని, ఆయన తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులకు ఆ భగవంతుడు మనోధైర్యం, ఓదార్పు ప్రసాదించాలని మానసిక దివ్యాంగుల పిల్లల తరఫున ప్రార్థించారు.

తమ కుమారుడి జ్ఞాపకార్థం మానసిక దివ్యాంగుల పిల్లలకు అన్నదానం చేసి సేవాభావాన్ని చాటుకున్న కోట వెంకటకృష్ణ, విజయశాంతి దంపతులకు మదర్ థెరిస్సా సేవాసదనం నిర్వాహకులు, పిల్లల తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

మురుసు తుఫాన్‌తో దెబ్బతిన్న మిరప పంటలను పరిశీలించిన ఉద్యాన శాఖ అధికారి

రైతులకు పంటల రక్షణకు తీసుకోవాల్సిన నివారణ చర్యలపై సూచనలు



వేంసూరు/నవంబర్ 5 (జర్నలిస్ట్ వార్త):
మురుసు తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు నేలకొరిగిన మిరప పంటలను జిల్లా ఉద్యాన శాఖ అధికారి మధుసూదన్ గురువారం పరిశీలించారు. వేంసూరు మండలం కల్లూరుగూడెం గ్రామంలో దెబ్బతిన్న మిరప తోటలను సందర్శించి, పంట నష్టంపై రైతులతో మాట్లాడి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వర్షాల కారణంగా దెబ్బతిన్న పంటలను కాపాడుకునేందుకు రైతులు తీసుకోవాల్సిన తగిన నివారణ చర్యలను వివరించారు. పంటల పరిస్థితిని పరిశీలించి అవసరమైన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల ఉద్యాన అధికారి శ్రావణితో పాటు గ్రామ రైతులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బాలల విజ్ఞాన కాంగ్రెస్ పోటీలకు వివేకవర్ధిని విద్యార్థినులు



కేసముద్రం/నవంబర్ 5 (జర్నలిస్ట్ వార్త):
జాతీయ బాలల విజ్ఞాన కాంగ్రెస్ జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన కేసముద్రంలోని శ్రీ వివేకవర్ధిని హైస్కూల్ విద్యార్థినులు బి. హిమబిందు, కె. ప్రీతిలను పాఠశాల కరస్పాండెంట్ చిర్ర యాకాంతం గౌడ్, ఉపాధ్యాయులు గురువారం అభినందించారు. విద్యార్థినులకు మార్గనిర్దేశం చేసిన ఉపాధ్యాయుడు మేకల విష్ణును ప్రత్యేకంగా ప్రశంసించారు.
మహబూబాబాద్‌లో బుధవారం నిర్వహించిన 32వ జాతీయ బాలల విజ్ఞాన కాంగ్రెస్ జిల్లా స్థాయి పోటీల్లో తొమ్మిదో తరగతి విద్యార్థినులు హిమబిందు, ప్రీతి 'జంతు వ్యర్థాలు, వ్యవసాయ వ్యర్థాల నుంచి సేంద్రియ ఎరువుల తయారీ' అనే వినూత్న ప్రాజెక్టును ప్రదర్శించారు. వ్యర్థాలను వనరులుగా మలిచి సేంద్రియ ఎరువులను తయారు చేయడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు ఎలా తోడ్పడవచ్చో తమ ప్రాజెక్టు ద్వారా వివరించారు. ఈ ప్రాజెక్టు న్యాయనిర్ణేతలను ఆకట్టుకోవడంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది.ఈ సందర్భంగా కరస్పాండెంట్ చిర్ర యాకాంతం గౌడ్ మాట్లాడుతూ విద్యార్థుల్లో చిన్నతనం నుంచే శాస్త్రీయ దృక్పథం, పరిశోధనాత్మక ఆలోచనా విధానాన్ని పెంపొందించాలని అన్నారు. పుస్తక జ్ఞానానికే పరిమితం కాకుండా నిత్యజీవితంలో ఎదురయ్యే సమస్యలకు శాస్త్రీయ పరిష్కారాలు కనుగొనేలా విద్యార్థులను ప్రోత్సహించాలని సూచించారు. జిల్లా స్థాయిలో ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన హిమబిందు, ప్రీతిలు అక్కడ కూడా విజయం సాధించి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. వారి విజయానికి కృషి చేసిన గైడ్ టీచర్ మేకల విష్ణుతో పాటు ఉపాధ్యాయులను అభినందించారు.
ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

అమెరికా మధ్యంతర ఎన్నికల్లో డెమోక్రాట్ల చారిత్రక విజయం

ట్రంప్ పాలనకు ప్రజల గట్టి హెచ్చరిక.. రెండు సభల్లోనూ ప్రతిపక్ష ఆధిపత్యం రిపబ్లికన్లకు కోలుకోలేని రాజకీయ ఎదురుదెబ్బ అమెరికా రాజకీయాల్లో కొత్త అధ్యాయం



నవంబర్ 5 (జర్నలిస్ట్ వార్త):అమెరికా మధ్యంతర ఎన్నికల ఫలితాలు ప్రపంచ రాజకీయాల్లో ఆసక్తికర చర్చకు తెరలేపాయి. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నాయకత్వంలోని రిపబ్లికన్ పార్టీకి ప్రజలు గట్టి ఎదురుదెబ్బ ఇవ్వగా, డెమోక్రటిక్ పార్టీ రెండు సభల్లోనూ ఆధిపత్యాన్ని సాధించింది. ప్రతినిధుల సభతో పాటు సెనేట్‌లోనూ మెజారిటీ దక్కించుకోవడం అమెరికా రాజకీయ చరిత్రలో కీలక పరిణామంగా నిలిచింది. ట్రంప్ రెండోసారి అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన తర్వాత జరిగిన ఈ ఎన్నికలు ఆయన ప్రభుత్వ విధానాలపై ప్రజల అభిప్రాయాన్ని వెల్లడించాయి. ముఖ్యంగా సంప్రదాయంగా రిపబ్లికన్లకు మద్దతుగా నిలిచే రాష్ట్రాల్లోనూ డెమోక్రాట్లు విజయాలు సాధించడం ఈ ఎన్నికల ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు.అమెరికా మధ్యంతర ఎన్నికలు కేవలం అధికార పార్టీకి, ప్రతిపక్షానికి మధ్య జరిగే పోటీ మాత్రమే కాదు. అధ్యక్షుడి పాలనపై ప్రజలు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేసే ముఖ్యమైన ప్రజాస్వామ్య ప్రక్రియ. అధ్యక్ష ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఎంతవరకు అమలయ్యాయి? ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయా? ఆర్థిక పరిస్థితులు ఆశించిన స్థాయిలో ఉన్నాయా? విదేశాంగ విధానాలు దేశ ప్రయోజనాలకు అనుగుణంగా ఉన్నాయా? అనే ప్రశ్నలకు ఓటర్లు తమ ఓటు ద్వారా సమాధానం చెబుతారు. ఈసారి కూడా అదే జరిగింది. ట్రంప్ ప్రభుత్వం అనుసరించిన విధానాలపై ప్రజల్లో పెరిగిన అసంతృప్తి ఎన్నికల ఫలితాల్లో ప్రతిబింబించిందనే విశ్లేషణలు వెలువడుతున్నాయి.**ఆర్థిక భారమే ప్రధాన కారణమా?**అమెరికా ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ కలిగిన దేశం. అయినప్పటికీ అక్కడి సామాన్య ప్రజలు నిత్యావసర వస్తువుల ధరలు, ఇంధన వ్యయం, గృహ అద్దెలు, వైద్య ఖర్చులు వంటి సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఉద్యోగాలు, వేతనాలు, కుటుంబాల ఆర్థిక భద్రత వంటి అంశాలు ఎన్నికల్లో కీలకంగా మారాయి. ప్రజల ఆదాయానికి, పెరుగుతున్న ఖర్చులకు మధ్య అంతరం పెరిగినప్పుడు ప్రభుత్వంపై అసంతృప్తి సహజంగానే వ్యక్తమవుతుంది. ఆర్థికాభివృద్ధి గణాంకాలు ఎంత గొప్పగా ఉన్నా సామాన్య కుటుంబానికి ఆర్థిక ఉపశమనం లభించకపోతే ఆ అభివృద్ధికి పెద్దగా అర్థం ఉండదు. ఈ విషయాన్ని రాజకీయ పార్టీలు గుర్తించాల్సిన అవసరం ఉంది.ట్రంప్ ప్రభుత్వం అనుసరించిన దిగుమతి సుంకాల విధానాలు కూడా చర్చనీయాంశంగా మారాయి. విదేశాల నుంచి దిగుమతి అయ్యే వస్తువులపై అధిక సుంకాలు విధించడం ద్వారా దేశీయ పరిశ్రమలను ప్రోత్సహించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. అయితే దిగుమతి ఖర్చులు పెరిగితే వాటి ప్రభావం వస్తువుల ధరలపై పడుతుంది. చివరకు ఆ భారాన్ని వినియోగదారులే భరించాల్సి వస్తుంది. వాణిజ్య యుద్ధాలు అంతర్జాతీయ మార్కెట్లలో అనిశ్చితిని సృష్టించడమే కాకుండా మిత్రదేశాలతోనూ సంబంధాలపై ప్రభావం చూపుతాయి. అమెరికా వంటి పెద్ద దేశం తీసుకునే ఆర్థిక నిర్ణయాలు ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల వాణిజ్య రంగాలపై ప్రభావం చూపుతాయి.**ఇరాన్ యుద్ధం.. ట్రంప్‌కు రాజకీయ సవాలు** ఈ ఎన్నికల్లో మరో ప్రధాన అంశం ఇరాన్‌తో కొనసాగుతున్న యుద్ధ పరిస్థితులు. యుద్ధం వల్ల ఇంధన సరఫరాలు, చమురు ధరలు, అంతర్జాతీయ వాణిజ్యం తీవ్ర ప్రభావానికి గురయ్యాయి. అమెరికా ప్రజలు తమ దేశం ఎదుర్కొంటున్న అంతర్గత సమస్యలకు పరిష్కారాలు కోరుకుంటున్న సమయంలో విదేశీ యుద్ధాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వడంపై విమర్శలు వ్యక్తమయ్యాయి. యుద్ధానికి వెచ్చించే నిధులు, సైనిక చర్యల వల్ల కలిగే ఆర్థిక భారం, భవిష్యత్తులో ఎదురయ్యే పరిణామాలపై ప్రజల్లో ఆందోళన పెరిగింది. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ సైతం ఎన్నికల ఓటమికి ఇరాన్ యుద్ధమే కారణమని వ్యాఖ్యానించినట్లు వార్తలు వెలువడ్డాయి. ట్రంప్ కూడా యుద్ధం కారణంగా ఇంధన ధరలు పెరిగిన విషయాన్ని అంగీకరించారు.ప్రపంచంలో అత్యంత శక్తిమంతమైన సైనిక వ్యవస్థ కలిగిన అమెరికా కూడా యుద్ధాల ఆర్థిక, రాజకీయ ప్రభావాల నుంచి తప్పించుకోలేదనే విషయం ఈ పరిణామాలతో స్పష్టమవుతోంది. సైనిక బలం మాత్రమే దేశ భద్రతకు, ప్రజల సంక్షేమానికి సరిపోదు. దౌత్య చర్చలు, అంతర్జాతీయ సహకారం, శాంతి ప్రయత్నాలు కూడా అంతే ముఖ్యమైనవి. యుద్ధం ప్రారంభించడం సులభమైనా దాని పరిణామాలను నియంత్రించడం చాలా కష్టం. అందువల్ల ఏ దేశమైనా విదేశాంగ విధానాలను రూపొందించేటప్పుడు ప్రజల ప్రయోజనాలను, అంతర్జాతీయ స్థిరత్వాన్ని దృష్టిలో ఉంచుకోవాలి.**రిపబ్లికన్ల కంచుకోటల్లోనూ మారిన రాజకీయ సమీకరణాలు**ఈ ఎన్నికల్లో డెమోక్రాట్లు సంప్రదాయ రిపబ్లికన్ రాష్ట్రాల్లోనూ విజయాలు సాధించడం ప్రత్యేకంగా ప్రస్తావించాల్సిన అంశం. కాన్సాస్‌లో దశాబ్దాల తర్వాత డెమోక్రటిక్ పార్టీకి సెనేట్ స్థానం దక్కడం, టెక్సాస్‌లోనూ సెనేట్ విజయాన్ని నమోదు చేయడం రాజకీయ పరిశీలకులను ఆశ్చర్యపరిచింది. సౌత్ కరోలినా సహా పలు రాష్ట్రాల్లో వచ్చిన ఫలితాలు రిపబ్లికన్ పార్టీకి ఉన్న సంప్రదాయ ఓటు బ్యాంకులో మార్పులు వస్తున్నాయనే చర్చకు కారణమయ్యాయి. ఓటర్లు పార్టీ విధేయతకే పరిమితం కాకుండా తమ రోజువారీ సమస్యలు, అభ్యర్థుల వైఖరి, ప్రభుత్వ పనితీరును కూడా పరిగణనలోకి తీసుకుంటున్నారని ఈ ఫలితాలు సూచిస్తున్నాయి.యువత, మధ్యతరగతి ప్రజలు, వివిధ సామాజిక వర్గాల ఓటర్లలో వచ్చిన మార్పులు కూడా ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేశాయి. ముఖ్యంగా ఉద్యోగ అవకాశాలు, విద్యా ఖర్చులు, వైద్య సదుపాయాలు, వలస విధానాలు వంటి అంశాలపై రాజకీయ పార్టీలు స్పష్టమైన వైఖరిని ప్రకటించాల్సిన పరిస్థితి ఏర్పడింది. కేవలం భావోద్వేగపూరిత ప్రసంగాలు, రాజకీయ విమర్శలతో ప్రజల మద్దతును నిలబెట్టుకోవడం సాధ్యం కాదనే విషయం ఈ ఎన్నికలు మరోసారి గుర్తుచేశాయి.
డెమోక్రాట్లు ప్రతినిధుల సభ, సెనేట్ రెండింటిలోనూ మెజారిటీ సాధించడంతో ట్రంప్ ప్రభుత్వానికి కొత్త సవాళ్లు ఎదురుకానున్నాయి. ప్రభుత్వ బడ్జెట్, ఆర్థిక కేటాయింపులు, చట్టాల ఆమోదం, వివిధ ప్రభుత్వ విభాగాల పనితీరుపై కాంగ్రెస్‌కు కీలక అధికారాలు ఉంటాయి. ఈ అధికారాలను ఉపయోగించి ట్రంప్ ప్రభుత్వ నిర్ణయాలను డెమోక్రాట్లు ప్రశ్నించే అవకాశం ఉంది.

స్టార్టప్ ఇంక్యుబేటర్లే భవిష్యత్తు!

ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా.. ఉద్యోగాలు కల్పించే స్థాయికి యువత ఎదగాలి ప్రతి విశ్వవిద్యాలయంలో ఇంక్యుబేషన్ కేంద్రాలు ఏర్పాటు చేయాలి



నవంబర్ 5 (జర్నలిస్ట్ వార్త):భారతదేశంలో ఉన్నత విద్య, ముఖ్యంగా మేనేజ్‌మెంట్ విద్యకు ప్రత్యేక గుర్తింపు ఉంది. ఐఐటీలు, ఐఐఎంలతో పాటు ప్రైవేటు విద్యాసంస్థలు ఏటా వేలాది మంది పట్టభద్రులను తయారు చేస్తున్నాయి. అయితే వీరిలో ఎంతమంది కొత్త వ్యాపారాలను ప్రారంభిస్తున్నారు? ఎంతమంది ఇతరులకు ఉపాధి కల్పిస్తున్నారు? అనే ప్రశ్నలు కీలకంగా మారుతున్నాయి. చదువు పూర్తయిన తర్వాత మంచి ఉద్యోగం, అధిక వేతనం, ఉన్నత హోదా కోరుకోవడం సహజమే. కానీ యువత ఉద్యోగార్థులుగానే కాకుండా ఉద్యోగ కల్పనదారులుగా ఎదగాల్సిన అవసరం ఉంది.ప్రస్తుతం ఉద్యోగ రంగంలో పోటీ తీవ్రంగా పెరుగుతోంది. ఆటోమేషన్, కృత్రిమ మేధ వంటి సాంకేతిక మార్పులతో సంప్రదాయ ఉద్యోగాల స్వరూపం మారుతోంది. ఈ పరిస్థితుల్లో యువత కొత్త ఆలోచనలతో వ్యాపారాలను ప్రారంభించి ఉపాధి అవకాశాలను సృష్టించాలి. ఒక స్టార్టప్ విజయవంతమైతే వ్యవస్థాపకుడితో పాటు ఉద్యోగులు, సరఫరాదారులు, సాంకేతిక నిపుణులు, ఇతర సేవా సంస్థలకు కూడా ఉపాధి లభిస్తుంది. చిన్న ఆలోచన కూడా భవిష్యత్తులో పెద్ద పరిశ్రమగా ఎదిగే అవకాశం ఉంది.అయితే స్టార్టప్ ప్రారంభించడం అంత సులభం కాదు. పెట్టుబడులు, మార్కెట్ పరిస్థితులు, సాంకేతిక పరిజ్ఞానం, వ్యాపార నిర్వహణ వంటి అంశాల్లో ఎన్నో సవాళ్లు ఎదురవుతాయి. కొన్ని సంస్థలు ప్రారంభ దశలోనే మూతపడుతున్నాయి.

ఇలాంటి వైఫల్యాలను ఓటమిగా కాకుండా అనుభవాలుగా స్వీకరించే వాతావరణం ఏర్పడాలి. యువతకు సరైన మార్గదర్శకత్వం, ఆర్థిక సహకారం అందిస్తే మరిన్ని ఆవిష్కరణలు వెలుగులోకి వస్తాయి.**ఇంక్యుబేషన్ కేంద్రాలతో ప్రోత్సాహం**ప్రతి విశ్వవిద్యాలయంలో స్టార్టప్ ఇంక్యుబేషన్ కేంద్రాలను ఏర్పాటు చేయాలి. విద్యార్థుల కొత్త ఆలోచనలను గుర్తించి వాటిని వ్యాపారాలుగా మార్చేందుకు అవసరమైన శిక్షణ, సాంకేతిక సహకారం అందించాలి. అనుభవజ్ఞులైన పారిశ్రామికవేత్తలను మార్గదర్శకులుగా నియమించాలి. బ్యాంకులు, వెంచర్ క్యాపిటల్ సంస్థలు, ఏంజెల్ ఇన్వెస్టర్లతో విద్యార్థులకు అనుసంధానం కల్పించాలి. కేవలం కార్యాలయాలు, ఇంటర్నెట్ సదుపాయాలకే పరిమితం కాకుండా ఆలోచన నుంచి ఉత్పత్తి తయారీ, మార్కెట్ ప్రవేశం వరకు పూర్తి సహకారం అందించాలి.**గ్రామీణ ప్రాంతాలకూ స్టార్టప్ అవకాశాలు**స్టార్టప్ సంస్కృతి హైదరాబాద్, బెంగళూరు, ముంబై వంటి నగరాలకే పరిమితం కాకూడదు. గ్రామీణ ప్రాంతాలు, చిన్న పట్టణాల్లోని యువతకు కూడా అవకాశాలు కల్పించాలి. వ్యవసాయం, ఆరోగ్యం, విద్య, పర్యావరణ పరిరక్షణ, గ్రామీణ పరిశ్రమలు వంటి రంగాల్లో కొత్త ఆవిష్కరణలను ప్రోత్సహించాలి. స్థానిక సమస్యలకు సాంకేతిక పరిష్కారాలు చూపించే సంస్థలకు పెట్టుబడులు, శిక్షణ అందించాలి. దీనివల్ల గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి పెరగడంతో పాటు నగరాలకు వలసలు కూడా తగ్గుతాయి. **తెలంగాణలో విస్తృత అవకాశాలు**స్టార్టప్ రంగంలో తెలంగాణకు ప్రత్యేక అవకాశాలున్నాయి. హైదరాబాద్ ఇప్పటికే ఐటీ, ఫార్మా, బయోటెక్నాలజీ, పరిశోధన రంగాలకు కేంద్రంగా ఎదిగింది. టీ-హబ్ వంటి సంస్థలు కొత్త వ్యాపారాలకు ప్రోత్సాహం అందిస్తున్నాయి. ఈ అవకాశాలను రాష్ట్రంలోని ఇతర జిల్లాలకు కూడా విస్తరించాలి. వరంగల్, కరీంనగర్, ఖమ్మం తదితర ప్రాంతాల్లో ఇంక్యుబేషన్ కేంద్రాలను ఏర్పాటు చేసి స్థానిక యువతను ప్రోత్సహించాలి. విద్యాసంస్థలు, పరిశ్రమలు, ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం పెంచాలి.మొత్తంగా దేశ ఆర్థికాభివృద్ధిలో స్టార్టప్‌ల పాత్ర కీలకంగా మారుతోంది. యువతలోని ప్రతిభను గుర్తించి సరైన పెట్టుబడులు, సాంకేతిక పరిజ్ఞానం, మార్గదర్శకత్వం అందించాలి. విద్యార్థులు ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా కొత్త వ్యాపారాలను స్థాపించి ఇతరులకు ఉపాధి కల్పించే స్థాయికి ఎదిగేలా విద్యావ్యవస్థలో మార్పులు రావాలి. ప్రతి విశ్వవిద్యాలయంలో ఇంక్యుబేషన్ కేంద్రాలు, ప్రతి జిల్లాలో స్టార్టప్‌లకు ప్రోత్సాహక వేదికలు ఏర్పాటైతే యువత ఆలోచనలకు రెక్కలు వస్తాయి. దేశ భవిష్యత్తు అభివృద్ధికి స్టార్టప్ ఇంక్యుబేటర్లే కీలక బాటలు వేయగలవు.

దేశవ్యాప్తంగా వందే భారత్ హవా..

నిండిపోతున్న సీట్లు, స్లీపర్లకు ఫుల్ డిమాండ్



నవంబర్ 5 (జర్నలిస్ట్ వార్త):
దేశంలో ప్రవేశపెట్టిన సెమీ-హై-స్పీడ్ రైళ్లు వందే భారత్ సర్వీసులకు ప్రయాణికుల నుంచి అపూర్వ స్పందన లభిస్తోంది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఈ రైళ్ల ఆక్యుపెన్సీ గణాంకాలు వాటి విజయాన్ని స్పష్టం చేస్తున్నాయి. ముఖ్యంగా, తిరువనంతపురం సెంట్రల్-మంగళూరు సెంట్రల్ మధ్య నడిచే వందే భారత్ ఎక్స్‌ప్రెస్ ఏకంగా 189.35% ఆక్యుపెన్సీతో దేశంలోనే అగ్రస్థానంలో నిలిచి సరికొత్త రికార్డు సృష్టించింది.రైల్వే బోర్డు అధికారి వెల్లడించిన వివరాల ప్రకారం, దేశవ్యాప్తంగా నడుస్తున్న అన్ని వందే భారత్ చైర్ కార్ సర్వీసుల్లో కలిపి సగటు ఆక్యుపెన్సీ 99.10%గా నమోదైంది. జనవరి 2026లో ప్రారంభమైన తొలి వందే భారత్ స్లీపర్ రైలు (హౌరా-కామాఖ్య) కూడా ప్రయాణికులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఈ రైలులో ఏకంగా 114.54% ఆక్యుపెన్సీ నమోదైనట్లు ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్ తన కథనంలో పేర్కొంది.



పాక్‌పై భారత్ ఘన విజయం..

చివర్లో ఉత్కంఠ!

- సాఫ్ ఛాంపియన్‌షిప్ ఆరంభ మ్యాచ్‌లో 3-2తో గెలుపు

ఢాకా: దక్షిణాసియా ఫుట్‌బాల్ సమాఖ్య ఛాంపియన్‌షిప్-2026లో భారత ఫుట్‌బాల్ జట్టు అదరగొట్టింది. చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో జరిగిన ఆరంభ మ్యాచ్‌లో 3-2 గోల్స్ తేడాతో ఘన విజయం సాధించింది. మ్యాచ్ ప్రారంభం నుంచే దూకుడుగా ఆడిన భారత ఆటగాళ్లు తొలి అర్ధభాగంలోనే మూడు గోల్స్ చేసి ప్రత్యర్థిపై పూర్తి ఆధిపత్యం ప్రదర్శించారు.మ్యాచ్ 13వ నిమిషంలో సుహైల్ అహ్మద్ భట్ తొలి గోల్ చేసి భారత్‌కు ఆధిక్యాన్ని అందించాడు. ఆ తర్వాత కేవలం ఆరు నిమిషాల వ్యవధిలోనే మరోసారి గోల్ సాధించి స్కోరును 2-0కు చేర్చాడు. 32వ నిమిషంలో మాంగ్లెంతాంగ్ కిప్‌గెన్ మూడో గోల్ చేయడంతో భారత్ 3-0 ఆధిక్యంలోకి వెళ్లింది. తొలి అర్ధభాగం ముగిసే సమయానికి భారత జట్టు పటిష్ట స్థితిలో నిలిచింది.అయితే మ్యాచ్ చివరి నిమిషాల్లో పాకిస్థాన్ ఆటగాళ్లు పోరాట పటిమ చూపించారు. 90+1వ నిమిషంలో నజీబ్ గోల్ చేయగా, 90+4వ నిమిషంలో ఫూజీ మరో గోల్ సాధించాడు. దీంతో స్కోరు 3-2కు చేరి మ్యాచ్‌లో ఉత్కంఠ నెలకొంది. అయినప్పటికీ భారత ఆటగాళ్లు ఒత్తిడిని అధిగమించి ఆధిక్యాన్ని కాపాడుకున్నారు. చివరకు 3-2తో విజయం సాధించి సాఫ్ ఛాంపియన్‌షిప్‌లో శుభారంభం చేశారు.

కోహ్లీ బ్యాటింగ్‌కు ఫిదా..

రవిశాస్త్రి ప్రశంసల వర్షం!

గత 7-10 ఏళ్లలో ఆడిన అత్యుత్తమ ఇన్నింగ్స్‌ల్లో ఇదొకటి

పరిమిత ఓవర్ల క్రికెట్‌లో కోహ్లీనే ఆల్‌టైమ్ గ్రేట్

ఇప్పటికీ టెస్టుల్లో రాణించే సత్తా ఉందని వ్యాఖ్య



న్యూఢిల్లీ: టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ మరోసారి తన బ్యాటింగ్‌తో అభిమానులను అలరించాడు. న్యూజిలాండ్‌తో జరిగిన తొలి వన్డేలో అద్భుత ఆటతీరుతో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఫాస్ట్ బౌలర్లకు అనుకూలంగా ఉన్న పిచ్‌పై కివీస్ బౌలర్లను సమర్థంగా ఎదుర్కొని కేవలం 51 బంతుల్లోనే 74 పరుగులు సాధించాడు. కోహ్లీ ప్రదర్శనపై మాజీ భారత కోచ్ రవిశాస్త్రి ప్రశంసల వర్షం కురిపించాడు.**అద్భుతమైన ఇన్నింగ్స్..** న్యూజిలాండ్ పేసర్లకు సహకరించిన పిచ్‌పై కోహ్లీ చూపిన ఆత్మవిశ్వాసం, బ్యాటింగ్ నైపుణ్యం అద్భుతమని రవిశాస్త్రి కొనియాడాడు. గత ఏడెనిమిది, పదేళ్లలో కోహ్లీ ఆడిన అత్యుత్తమ ఇన్నింగ్స్‌ల్లో ఇదొకటని అభిప్రాయపడ్డాడు. ఇలాంటి పరిస్థితుల్లో ఎలాంటి తప్పులు చేయకుండా, ఎంతో సులభంగా బ్యాటింగ్ చేయడం సాధారణ విషయం కాదని పేర్కొన్నాడు. ఇతర బ్యాటర్లకు కష్టంగా అనిపించిన పిచ్‌పై కోహ్లీ మాత్రం తనదైన శైలిలో పరుగులు సాధించాడని ప్రశంసించాడు.**పరిమిత ఓవర్లలో ఆల్‌టైమ్ గ్రేట్..** కోహ్లీ గణాంకాలు, సాధించిన పరుగులు, సెంచరీలు, లక్ష్య ఛేదనలో జట్టును విజయతీరాలకు చేర్చిన తీరు అతడి గొప్పతనానికి నిదర్శనమని శాస్త్రి పేర్కొన్నాడు. పరిమిత ఓవర్ల క్రికెట్‌లో కోహ్లీని ఆల్‌టైమ్ అత్యుత్తమ ఆటగాడిగా అభివర్ణించాడు. క్రీజులో ఉన్నప్పుడు పరుగుల వేగాన్ని నియంత్రిస్తూ, అవసరమైన సమయంలో దూకుడు పెంచడం అతడి ప్రత్యేకత అని తెలిపాడు.**టెస్టుల్లోనూ ఆడగలడు..** విరాట్ కోహ్లీకి ఇప్పటికీ టెస్టు క్రికెట్‌లో రాణించే సామర్థ్యం ఉందని రవిశాస్త్రి స్పష్టం చేశాడు. అతడి ఫిట్‌నెస్ స్థాయిలు అత్యుత్తమంగా ఉన్నాయని, శారీరక దృఢత్వం, క్రమశిక్షణ, ఆటపై అంకితభావం చూస్తే టెస్టుల్లోనూ సత్తా చాటగలడని అభిప్రాయపడ్డాడు. కోహ్లీని మళ్లీ టెస్టు క్రికెట్‌లో చూడాలని పలువురు అంతర్జాతీయ ఆటగాళ్లు కోరుకుంటున్నారని పేర్కొన్నాడు.

రికార్డుల రారాజు రొనాల్డో రిటైర్మెంట్!

23 ఏళ్ల అంతర్జాతీయ ఫుట్‌బాల్ ప్రయాణానికి ముగింపు..

పోర్చుగల్ తరఫున 234 మ్యాచ్‌లు, 146 గోల్స్



ఫుట్‌బాల్ ప్రపంచాన్ని తన ఆటతీరుతో ఉర్రూతలూగించిన పోర్చుగల్ దిగ్గజం క్రిస్టియానో రొనాల్డో అంతర్జాతీయ ఫుట్‌బాల్‌కు వీడ్కోలు పలికాడు. 23 ఏళ్లపాటు పోర్చుగల్ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన ఆయన తన సుదీర్ఘ ప్రయాణానికి ముగింపు ప్రకటించాడు. ఈ సందర్భంగా తన జాతీయ జట్టు ఏడో నంబర్ జెర్సీని భవిష్యత్తు తరానికి అందించాల్సిన సమయం వచ్చిందని సామాజిక మాధ్యమాల ద్వారా వెల్లడించాడు.**రికార్డులే చిరునామాగా..** రొనాల్డో తన అంతర్జాతీయ కెరీర్‌లో ఎన్నో అరుదైన రికార్డులు సృష్టించాడు. పోర్చుగల్ తరఫున 234 మ్యాచ్‌లు ఆడి 146 గోల్స్ సాధించాడు. అంతర్జాతీయ ఫుట్‌బాల్‌లో అత్యధిక గోల్స్ చేసిన ఆటగాడిగా చరిత్రలో నిలిచాడు. ఐదుసార్లు ఫిఫా అత్యుత్తమ ఆటగాడిగా ఎంపికయ్యాడు. నాలుగు యూరోపియన్ గోల్డెన్ షూ పురస్కారాలను అందుకున్నాడు. కెరీర్‌లో 1,300కు పైగా మ్యాచ్‌లు ఆడిన ఘనత సాధించాడు.**పోర్చుగల్‌కు చిరస్మరణీయ విజయాలు..** 2016లో పోర్చుగల్ యూరో కప్ గెలవడంలో రొనాల్డో కీలక పాత్ర పోషించాడు. 2019, 2025లో నేషన్స్ లీగ్ టైటిళ్లు సాధించిన జట్టులోనూ భాగమయ్యాడు. ఆరు ప్రపంచకప్‌లలో ఆడిన అరుదైన ఆటగాళ్లలో ఒకడిగా నిలిచాడు. ప్రపంచకప్ సాధించాలన్న కల నెరవేరకపోయినా, దేశం తరఫున ఆడినందుకు జీవితాంతం గర్వపడతానని తన వీడ్కోలు సందేశంలో పేర్కొన్నాడు.**క్లబ్ ఫుట్‌బాల్‌లో కొనసాగింపు..** అంతర్జాతీయ కెరీర్‌కు ముగింపు పలికినప్పటికీ రొనాల్డో ఫుట్‌బాల్‌కు పూర్తిగా దూరం కావడం లేదు. సౌదీ అరేబియా క్లబ్ అల్ నసర్ తరఫున కొనసాగనున్నాడు. పోర్చుగల్ జట్టుకు అందించిన సేవలు, సాధించిన రికార్డులు ఫుట్‌బాల్ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోనున్నాయి.

రెండో వన్డేలో నితీశ్‌కు చోటు అవసరం లేదు!

● రహానే కీలక వ్యాఖ్యలు..

ఆకిబ్ నబీకి మరో అవకాశం ఇవ్వాలని సూచన



న్యూఢిల్లీ: న్యూజిలాండ్‌తో జరుగుతున్న వన్డే సిరీస్‌లో టీమిండియా వరుస విజయాలపై దృష్టి సారించింది. తొలి వన్డేలో విజయం సాధించిన భారత జట్టు రెండో మ్యాచ్‌లోనూ గెలిచి సిరీస్‌లో 2-0 ఆధిక్యం సాధించాలని భావిస్తోంది. ఈ నేపథ్యంలో తుది జట్టు కూర్పుపై చర్చ మొదలైంది. ముఖ్యంగా తెలుగు యువ ఆటగాడు నితీశ్ కుమార్ రెడ్డికి రెండో వన్డేలోనైనా అవకాశం దక్కుతుందా? లేదా? అన్న ఆసక్తి నెలకొంది. ఈ అంశంపై మాజీ భారత క్రికెటర్ అజింక్య రహానే స్పందించాడు. ప్రస్తుత భారత జట్టు కూర్పును పరిశీలిస్తే నితీశ్ కుమార్ రెడ్డిని రెండో వన్డేలో ఆడించాల్సిన అవసరం కనిపించడం లేదని అభిప్రాయపడ్డాడు. నితీశ్ జట్టులో ఉన్నా, లేకపోయినా పెద్దగా తేడా ఉండదని పేర్కొన్నాడు. ప్రస్తుతం జట్టులో ఉన్న ఆటగాళ్లతోనే సమతూకమైన కూర్పు ఉందని రహానే వ్యాఖ్యానించినట్లు సమాచారం.**ఆకిబ్ నబీకి మరో అవకాశం ఇవ్వాలి..** తొలి వన్డేలో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయిన యువ పేసర్ ఆకిబ్ నబీకి మాత్రం మరో అవకాశం ఇవ్వాలని రహానే సూచించాడు. తొలి మ్యాచ్‌లో నబీ ఆరు ఓవర్లు బౌలింగ్ చేసి 33 పరుగులు ఇచ్చినా వికెట్ సాధించలేకపోయాడు. అయినప్పటికీ అతడి ప్రతిభను నిరూపించుకునేందుకు మరో మ్యాచ్‌లో అవకాశం కల్పించాలని అభిప్రాయపడ్డాడు. యువ ఆటగాళ్లకు వరుసగా అవకాశాలు ఇవ్వడం ద్వారా వారిలో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని రహానే పేర్కొన్నాడు. ఒక మ్యాచ్‌లో వికెట్లు తీయలేదని వెంటనే పక్కన పెట్టకుండా, మరోసారి తమ సత్తా చాటుకునే అవకాశం ఇవ్వాలని సూచించాడు. ఈ విషయంలో కెప్టెన్ శుభ్‌మన్ గిల్ నిర్ణయం కీలకం కానుంది.**తొలి మ్యాచ్‌లో భారత్ విజయం..** ఐదు వన్డేల సిరీస్‌ను భారత్ విజయంతో ప్రారంభించింది. ఆక్లాండ్ వేదికగా జరిగిన తొలి వన్డేలో న్యూజిలాండ్‌ను 185 పరుగులకే ఆలౌట్ చేసింది. వర్షం కారణంగా భారత్ లక్ష్యాన్ని 143 పరుగులకు కుదించగా, 22.4 ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. సమిష్టి ప్రదర్శనతో ఐదు వికెట్ల తేడాతో విజయం సాధించింది.ఇప్పుడు వెల్లింగ్‌టన్ వేదికగా జరిగే రెండో వన్డేపై భారత జట్టు దృష్టి సారించింది. తొలి మ్యాచ్‌లో సాధించిన విజయోత్సాహంతో బరిలోకి దిగనున్న గిల్ సేన.. మరో గెలుపుతో సిరీస్‌లో ఆధిక్యాన్ని పెంచుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. నితీశ్‌కు అవకాశం కల్పిస్తారా? ఆకిబ్ నబీని కొనసాగిస్తారా? అన్నది జట్టు ఎంపికలో ఆసక్తికరంగా మారింది.

రంజీ ట్రోఫీలో త్రిపుర సంచలనం..

సౌరాష్ట్రపై ఘన విజయం!

- 133 పరుగుల తేడాతో గెలుపు..

సీజన్‌లో తొలి విజయాన్ని నమోదు



అగర్తలా: రంజీ ట్రోఫీ ఎలైట్ గ్రూప్-బి మ్యాచ్‌లో త్రిపుర జట్టు సంచలనం సృష్టించింది. రెండుసార్లు రంజీ ట్రోఫీ విజేతగా నిలిచిన సౌరాష్ట్రను 133 పరుగుల తేడాతో ఓడించింది. గురువారం ముగిసిన ఈ నాలుగు రోజుల మ్యాచ్‌లో అద్భుత ప్రదర్శనతో త్రిపుర ఈ సీజన్‌లో తొలి విజయాన్ని అందుకుంది.మొదట బ్యాటింగ్ చేసిన త్రిపుర తొలి ఇన్నింగ్స్‌లో 268 పరుగులు చేసింది. అనంతరం బరిలోకి దిగిన సౌరాష్ట్ర కేవలం 118 పరుగులకే కుప్పకూలింది. దీంతో త్రిపురకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది. రెండో ఇన్నింగ్స్‌లో త్రిపుర 191 పరుగులు చేసి ఆలౌటైంది. దీంతో సౌరాష్ట్ర ముందు 342 పరుగుల లక్ష్యం నిలిచింది.భారీ లక్ష్య ఛేదనలో సౌరాష్ట్ర రెండో ఇన్నింగ్స్‌లో 208 పరుగులకే పరిమితమైంది. ఆ జట్టు బ్యాటర్ అర్పిత్ వాసవడ 189 బంతుల్లో 89 పరుగులు చేసి ఒంటరి పోరాటం చేశాడు. అయితే మిగతా బ్యాటర్ల నుంచి సహకారం లభించకపోవడంతో జట్టు ఓటమి పాలైంది.**బౌలర్ల విజృంభణ..** త్రిపుర బౌలర్లు సందీప్ సర్కార్, అభిజిత్ సర్కార్ కీలక వికెట్లు పడగొట్టి జట్టు విజయంలో ప్రధాన పాత్ర పోషించారు. సందీప్ సర్కార్ రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి ఎనిమిది వికెట్లు సాధించగా, అభిజిత్ సర్కార్ కూడా ప్రత్యర్థి బ్యాటర్లను కట్టడి చేశాడు. రెండో ఇన్నింగ్స్‌లో సందీప్ నాలుగు, అభిజిత్ మూడు వికెట్లు పడగొట్టారు. ఈ విజయంతో నాలుగు మ్యాచ్‌ల్లో ఆరు పాయింట్లు సాధించిన త్రిపుర పాయింట్ల పట్టికలో ఏడో స్థానానికి చేరుకుంది.

సీఎస్‌కే, ఎస్ఆర్‌హెచ్ మధ్య నలుగురు ఆటగాళ్ల మార్పిడి!

● ఐపీఎల్-2027కు ముందే కీలక ట్రేడ్.. చెన్నైకి లివింగ్‌స్టోన్, జాక్ ఎడ్వర్డ్స్ ● హైదరాబాద్ జట్టులోకి ఖలీల్ అహ్మద్, నాథన్ ఎల్లిస్



న్యూఢిల్లీ: ఐపీఎల్-2027 సీజన్‌కు ముందు చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే), సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్) జట్లు కీలక మార్పులు చేపట్టాయి. రెండు ఫ్రాంచైజీలు నలుగురు ఆటగాళ్లను పరస్పరం మార్చుకుంటూ ట్రేడ్ ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఇంగ్లండ్ ఆల్‌రౌండర్ లియామ్ లివింగ్‌స్టోన్, ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్ జాక్ ఎడ్వర్డ్స్ చెన్నై జట్టులోకి వెళ్లగా.. భారత పేసర్ ఖలీల్ అహ్మద్, ఆస్ట్రేలియా బౌలర్ నాథన్ ఎల్లిస్ హైదరాబాద్ జట్టులో చేరనున్నారు.**చెన్నైకి ఇద్దరు ఆల్‌రౌండర్లు..** లివింగ్‌స్టోన్ గతంలో హైదరాబాద్ జట్టు రూ.13 కోట్లకు కొనుగోలు చేయగా, తాజా ఒప్పందంలో రూ.6 కోట్లకే చెన్నైకి బదిలీ అయ్యాడు. ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్ జాక్ ఎడ్వర్డ్స్ రూ.3 కోట్ల పాత ధరతోనే సీఎస్‌కేలో చేరనున్నాడు. గాయంతో గత సీజన్‌లో ఎడ్వర్డ్స్ ఒక్క మ్యాచ్ కూడా ఆడలేకపోయాడు. లివింగ్‌స్టోన్ కూడా రెండు మ్యాచ్‌లకే పరిమితమయ్యాడు.**హైదరాబాద్‌కు పేసర్ల బలం..** భారత ఎడమచేతి వాటం పేసర్ ఖలీల్ అహ్మద్ రూ.4.8 కోట్ల ధరతో తిరిగి సన్‌రైజర్స్‌లోకి వస్తున్నాడు. గతంలో 2018 నుంచి 2021 వరకు హైదరాబాద్ తరఫున ఆడిన ఖలీల్.. ఐపీఎల్-2025లో చెన్నై తరఫున 14 మ్యాచ్‌ల్లో 15 వికెట్లు పడగొట్టాడు. గత సీజన్‌లో గాయంతో ఐదు మ్యాచ్‌లకే దూరమయ్యాడు. మరోవైపు ఆస్ట్రేలియా పేసర్ నాథన్ ఎల్లిస్ రూ.2 కోట్ల ధరతో ఎస్ఆర్‌హెచ్‌లో చేరనున్నాడు. డెత్ ఓవర్లలో వైవిధ్యమైన బౌలింగ్‌తో రాణించే ఎల్లిస్ రాకతో హైదరాబాద్ బౌలింగ్ విభాగానికి మరింత బలం చేకూరనుంది.**డిసెంబర్ 16న వేలం..** ఐపీఎల్-2027కు సంబంధించిన ఆటగాళ్ల మినీ వేలం డిసెంబర్ 16న గోవాలో జరగనుంది. ఆటగాళ్ల రిటెన్షన్, విడుదలకు నవంబర్ 17 వరకు గడువు ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఫ్రాంచైజీలు తమ జట్లను బలోపేతం చేసుకునేందుకు ట్రేడ్‌లు, ఆటగాళ్ల మార్పిడిపై దృష్టి సారిస్తున్నాయి.

ఓటీటీలోకి 'జైలర్-2'.. నవంబర్ 12 నుంచి సందడి!



ఐదు భాషల్లో స్ట్రీమింగ్.. రజనీకాంత్ అభిమానులకు శుభవార్త

హైదరాబాద్: సూపర్‌స్టార్ రజనీకాంత్ అభిమానులకు శుభవార్త. ఆయన నటించిన భారీ యాక్షన్ చిత్రం 'జైలర్-2' ఓటీటీలోకి వచ్చేందుకు సిద్ధమైంది. ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్ వీడియోలో నవంబర్ 12 నుంచి ఈ సినిమా స్ట్రీమింగ్ కానుంది. గురువారం ప్రైమ్ వీడియో సంస్థ అధికారికంగా ఈ విషయాన్ని ప్రకటించింది. తమిళం, తెలుగు, హిందీ, కన్నడ, మలయాళం భాషల్లో ప్రేక్షకులకు అందుబాటులోకి రానుంది. **భారీ తారాగణంతో..**నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో రజనీకాంత్ మరోసారి టైగర్ ముత్తువేల్ పాండియన్ పాత్రలో అలరించారు. మోహన్‌లాల్, హృతిక్ రోషన్, విజయ్ సేతుపతి ప్రత్యేక పాత్రల్లో కనిపించగా.. శివరాజ్‌కుమార్, ఎస్.జే. సూర్య, విద్యాబాలన్, మిథున్ చక్రవర్తి, రమ్యకృష్ణ తదితరులు కీలక పాత్రలు పోషించారు. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందించారు. **రికార్డు స్థాయి వసూళ్లు..**థియేటర్లలో విడుదలైన ఈ చిత్రం భారీ వసూళ్లు సాధించి తమిళ చిత్ర పరిశ్రమలో రికార్డులు సృష్టించింది. ప్రపంచవ్యాప్తంగా రూ.820 కోట్లకు పైగా వసూళ్లు సాధించినట్లు ట్రేడ్ వర్గాలు వెల్లడించాయి. దీంతో రజనీకాంత్ కెరీర్‌లోనే అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా నిలిచింది. థియేటర్లలో విజయవంతమైన ఈ సినిమా ఇప్పుడు ఓటీటీలోనూ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది.

చిన్ననాటి జ్ఞాపకాల్లోకి తీసుకెళ్లే 'సమ్మర్ హాలిడేస్'..



విభిన్నమైన కథలతో విజయాలు అందుకుంటున్న నిర్మాత ధీరజ్ మొగిలినేని తన ధీరజ్ మొగిలినేని ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్న చిత్రం 'సమ్మర్ హాలిడేస్'. శ్రీకర్ దర్శకత్వంలో మాస్టర్ రోహన్, మాస్టర్ అరుణ్, బేబి ఖుషి ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన ఈ చిత్రం నవంబర్ 6న థియేటర్లలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లో చిత్ర ప్రీ రిలీజ్ వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్, హీరో కిరణ్ అబ్బవరం, దర్శకుడు బాబీ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా హీరో కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ, "ఈ సినిమా చూస్తున్నప్పుడు పెద్దలు కూడా తమ బాల్యంలోకి వెళ్లిపోయి పిల్లల్లా మారి ఎంజాయ్ చేస్తారు. ఈతరం పిల్లలు చాలా టాలెంట్‌తో, కాన్ఫిడెంట్‌గా ఉన్నారు. బిజీ లైఫ్‌లో మనం మర్చిపోయిన ఎన్నో జ్ఞాపకాలను, అమ్మమ్మ ఊరి అనుభూతులను ఈ సినిమా గుర్తు చేస్తుంది. ఇది చిన్న సినిమాగా అనిపించడం లేదు. నిర్మాత ధీరజ్ నమ్మకం నిజమై, ఈ చిత్రం పెద్ద విజయం సాధించాలి" అని ఆకాంక్షించారు.నిర్మాత అల్లు అరవింద్ మాట్లాడుతూ, "ధీరజ్ నాతో కలిసి పనిచేశాడు. గీతా ఆర్ట్స్ లాగే క్వాలిటీ విషయంలో రాజీ పడకుండా ఈ సినిమాను తీర్చిదిద్దాడని విన్నాను. ఇలాంటి మంచి చిత్రాలను కిరణ్ అబ్బవరం లాంటి హీరోలు సపోర్ట్ చేయడం అభినందనీయం. ఇది అందరికీ మంచి నోస్టాల్జిక్ అనుభూతినిస్తుంది" అని అన్నారు.సహజనటి జయసుధ మాట్లాడుతూ, "ఇది పిల్లల సినిమా కాదు, ఇద్దరు చిన్న హీరోలు నటించిన సినిమా. వేసవి సెలవుల చుట్టూ అల్లుకున్న ఈ కథ అందరికీ కనెక్ట్ అవుతుంది. పెద్ద నిర్మాతలు కూడా ఇలాంటి చిన్న చిత్రాలను ప్రోత్సహించాలి" అని సూచించారు.నిర్మాత ధీరజ్ మొగిలినేని మాట్లాడుతూ, "ఇది పిల్లలు నటించిన పెద్దల సినిమా. ఈ చిత్రం చూశాక ప్రతి ఒక్కరూ తమ చిన్ననాటి స్నేహితులకు ఫోన్ చేస్తారు. కుటుంబమంతా కలిసి చూసేలా, మన జ్ఞాపకాలను గుర్తుచేసేలా ఉంటుంది" అని తెలిపారు. దర్శకుడు బాబీ మాట్లాడుతూ, ఈ సినిమా వినోదంతో పాటు మంచి సందేశం ఇస్తుందని, పిల్లలతో సినిమా తీయడం అంత సులువు కాదని, దర్శకుడు శ్రీకర్‌ను అభినందించారు.దర్శకుడు శ్రీకర్ తన టీమ్‌కు, నటీనటులకు కృతజ్ఞతలు తెలుపుతూ, ఈ సినిమా కచ్చితంగా బ్లాక్‌బస్టర్ అవుతుందనే నమ్మకాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాజీవ్ కనకాల, వాసుకి, మాస్టర్ అరుణ్, మాస్టర్ రోహన్ తదితరులు పాల్గొని చిత్ర విజయంపై ధీమా వ్యక్తం చేశారు.

కుటుంబ భావోద్వేగాలు.. మధురమైన సంగీతంతో 'మాయలేడి'!

నవంబర్ 13న ప్రపంచవ్యాప్తంగా విడుదల.. రాకేష్ వర్రే, మధుమిత సర్కార్ జంటగా నటించిన చిత్రం

హైదరాబాద్: యంగ్ హీరో, నిర్మాత రాకేష్ వర్రే నటిస్తూ నిర్మిస్తున్న తాజా చిత్రం 'మాయలేడి' విడుదలకు సిద్ధమైంది. క్రేజీ యాంట్స్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై తెరకెక్కిన ఈ చిత్రానికి ప్రశంకర్ దర్శకత్వం వహిస్తున్నారు. మధుమిత సర్కార్ కథానాయికగా నటిస్తోంది. ఈ నెల 13న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. తాజాగా హైదరాబాద్‌లో చిత్ర ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించారు.**ప్రేమలోని భావోద్వేగాలే కథాంశం..**దర్శకుడు ప్రశంకర్ మాట్లాడుతూ.. ప్రేమ సంబంధాల్లో ఎదురయ్యే అనేక భావోద్వేగాలను సినిమాలో చూపించామని తెలిపారు. క్రిష్ అనే యువకుడు తన ప్రేయసిలోని విభిన్నమైన భావాలను ఎలా ఎదుర్కొన్నాడన్నది ఆసక్తికరంగా తెరకెక్కించామని చెప్పారు. మంచి సంగీతం, వినోదంతో పాటు చిన్న సందేశం కూడా సినిమాలో ఉంటుందని వెల్లడించారు.

కుటుంబ ప్రేక్షకులను ఆకట్టుకునేలా..

హీరో, నిర్మాత రాకేష్ వర్రే మాట్లాడుతూ.. 'మన్మథుడు', 'నువ్వు నాకు నచ్చావ్', 'నిన్నే పెళ్లాడతా' వంటి చిత్రాల తరహాలో కుటుంబ అంశాలు, సంగీతానికి ప్రాధాన్యమిస్తూ 'మాయలేడి'ని రూపొందించామని తెలిపారు. 'ఖుషి' తరహా ప్రేమకథను తెరపై చూసి చాలా కాలమైందని, వరుసగా యాక్షన్ చిత్రాలు వస్తున్న తరుణంలో తమ సినిమా ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో హీరోయిన్ మధుమిత సర్కార్, మధురిమ, అంజి, భార్గవ నౌండ్ల తదితరులు పాల్గొన్నారు.



సూర్యతో నజ్రియా.. 'సీన్'తో లీఎంట్రీ!



హైదరాబాద్: ప్రముఖ నటి నజ్రియా నజీమ్ కొంతకాలం విరామం తర్వాత తమిళ చిత్ర పరిశ్రమలోకి తిరిగి వస్తున్నారు. సూర్య హీరోగా నటిస్తున్న 'సీన్' చిత్రంలో కథానాయికగా కనిపించనున్నారు. జీతూ మాధవన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో నజ్రియా 'మాయ' పాత్ర పోషిస్తున్నారు. నవంబర్ 6న దీపావళి సందర్భంగా తెలుగు, తమిళ భాషల్లో విడుదల కానుంది. సూర్యతో నజ్రియా తొలిసారి జోడీ కడుతుండటంతో అభిమానుల్లో ఆసక్తి నెలకొంది.

సౌత్ నటిననే వివక్ష చూపారు

: కరణ్ జోహార్‌పై రెజీనా సంచలన ఆరోపణలు

ప్రముఖ నటి రెజీనా కసాండ్రా బాలీవుడ్‌పై, ముఖ్యంగా దర్శక నిర్మాత కరణ్ జోహార్‌కు చెందిన ధర్మ ప్రొడక్షన్స్‌పై సంచలన ఆరోపణలు చేశారు. తాను నటించిన 'కేసరి చాప్టర్ 2' సినిమా ప్రమోషన్లలో తనను ఉద్దేశపూర్వకంగా పక్కనపెట్టారని, దక్షిణాది నటిని కావడం వల్లే ఈ వివక్ష ఎదురైందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఆమె వ్యాఖ్యలు భారత సినీ పరిశ్రమలో 'నార్త్ వర్సెస్ సౌత్' చర్చను మరోసారి రాజేశాయి.



అక్షయ్ కుమార్ హీరోగా నటించిన 'కేసరి 2'లో ఆయన భార్యగా కీలక పాత్ర పోషించినప్పటికీ, ప్రమోషన్ల సమయంలో తన పేరును తొలగించారని రెజీనా ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. "నాపై చిత్రీకరించిన పాటను విడుదల చేసి, సోషల్ మీడియాలో కనీసం ట్యాగ్ కూడా చేయలేదు. నేను సౌత్ ఇండియన్ నటిని కావడం వల్లే ఇలా చేశారా?" అని ఆమె ప్రశ్నించారు.ఇటీవల సౌత్ సినిమాలపై జాన్వీ కపూర్, రాధికా ఆప్టే చేసిన వ్యాఖ్యలపైనా ఆమె తీవ్రంగా స్పందించారు. ఉత్తరాది నటులు ఇలా బహిరంగంగా మాట్లాడటం వల్ల అనవసరంగా నార్త్-సౌత్ విభేదాలు సృష్టిస్తున్నారని విమర్శించారు. "ఒకవేళ సౌత్ సినిమాలలో పనిచేయడం ఇబ్బందిగా అనిపిస్తే, ఆ ప్రాజెక్ట్‌ల నుంచి బయటకు వెళ్లిపోవాలి. అంతేకానీ తర్వాత దాని గురించి మాట్లాడటం సరికాదు" అని ఆమె సూటిగా అన్నారు.బాలీవుడ్‌లో తనకు ఎదురైన అనుభవాన్ని, తోటి నటుల వ్యాఖ్యలను ముడిపెడుతూ రెజీనా చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు సినీ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. అయితే, రెజీనా ఆరోపణలపై ఇప్పటివరకు ధర్మ ప్రొడక్షన్స్ గానీ, కరణ్ జోహార్ గానీ స్పందించలేదు.

సాయి దుర్గ తేజ్, కిరణ్ నిశ్చితార్థం..

మెగా కుటుంబంలో మరో శుభకార్యం జరిగింది. నటుడు సాయి దుర్గ తేజ్, కిరణ్ నిశ్చితార్థం గురువారంనవంబర్ 5, 2026.. హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. హైదరాబాద్‌లోని హిల్టన్ హైదరాబాద్ జీనోమ్ వ్యాలీ రిసార్ట్‌లో ఈ వేడుకను నిర్వహించారు. కుటుంబ సభ్యులు, సన్నిహితుల సమక్షంలో ఈ జంట కొత్త జీవితానికి తొలి అడుగు వేసింది. సాయి దుర్గ తేజ్, కిరణ్ నిశ్చితార్థ వేడుకకు కొణిదెల, అల్లు కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. సాయి దుర్గ తేజ్ తల్లిదండ్రులు డాక్టర్ శివప్రసాద్, విజయదుర్గ, సోదరుడు వైష్ణవ్ తేజ్ ఈ వేడుకలో పాల్గొన్నారు. మెగాస్టార్ చిరంజీవి, సురేఖ కొణిదెల, రామ్ చరణ్ కూడా హాజరై నూతన జంటను ఆశీర్వదించారు. ఇక ఈ అమ్మాయి గురించి సోషల్ మీడియాలో తెగ సెర్చ్ చేస్తున్నారు. కాగా ఈ అమ్మాయి పూర్తి పేరు కిరణ్మయి అని తెలుస్తోంది. సాయి దుర్గ కేష్ కి ఎన్నో రోజుల నుంచి స్నేహితురాలు అని.. స్నేహమే ప్రేమగా మారి ఇప్పుడు పెళ్లికి దారి తీసినట్లు తెలుస్తోంది. ఇక అల్లు అర్జున్ తన భార్య స్నేహారెడ్డితో కలిసి ఈ వేడుకకు వచ్చారు. అల్లు బాబీ, నీలా షా, వరుణ్ తేజ్, లావణ్య త్రిపాఠి, వారి కుమారుడు వాయువ తేజ్ కూడా నిశ్చితార్థంలో



సందడి చేశారు. నాగబాబు, పద్మజ, నిహారిక కొణిదెల, అల్లు అరవింద్, అల్లు నిర్మల, అల్లు శిరీష్, నయనికా రెడ్డి కూడా ఈ వేడుకలో పాల్గొన్నారు. అకీరా నందన్, ఆద్య కూడా ఈ కుటుంబ వేడుకకు హాజరయ్యారు. సాయి దుర్గ తేజ్ నిశ్చితార్థానికి కుటుంబ సభ్యులతో పాటు పలువురు స్నేహితులు, సినీ ప్రముఖులు కూడా వచ్చారు. మంచు మనోజ్, భూమా మౌనిక రెడ్డి, నవీన్ విజయకృష్ణ, హర్ష చెముడు, వెంకీ కుడుముల, నవదీప్, హర్షిత్ రెడ్డి ఈ వేడుకలో పాల్గొన్నారు. ఇక సాయి దుర్గ తేజ్, కిరణ్ వివాహం డిసెంబర్ 10, 2026న హైదరాబాద్‌లో జరగనుంది.